

# పల్లె వెలుగు


తెలుగు జాతీయ దిన పత్రిక
అవినీతిపై నిఘా
Postal No: 3-78(D)-2026-2028
RNI APTEL 2013/54510








Published From : KURNOOL circulated at Nandyal,Srikakulam,VishakaPatanam,Vijayanagaram,East Godavari ,West Godavari, Krishna, Guntur,Prakasam, Nellore,Chittoor, Kurnool,Kadapa,Anantapuram, Hyderabad

ఎడిటర్ : ఎం. మహేష్ యాదవ్ | సంపుటి -14 | సంచిక - 280 | పేజీలు - 08 | వెల - 05/- | మంగళవారం 06-10-2026




## 27 లక్షల ఇళ్ల దాహం తీర్చే జలధార!

**రూ.30,156 కోట్లతో 27 లక్షల కుటుంబాలకు సురక్షిత తాగునీరు**

- ప్రొద్దుటూరులో 'అమరజీవి జలధార' పనులకు శ్రీకారం
- రాయలసీమ రైజింగ్‌ను ఎవరూ అడ్డుకోలేరన్న చంద్రబాబు
- గోదావరి పుష్కరాల లోపు పోలవరం పూర్తి చేస్తామని హామీ

*-గొడ్డలి పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పారన్న సీఎం*




గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జల్ జీవన్ మిషన్ 2.0లో భాగంగా రూ.30,156 కోట్ల భారీ వ్యయంతో చేపట్టిన 'అమరజీవి జలధార' పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సోమవారం ప్రారంభించారు. కడప జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని కొత్తపల్లిలో వారు పైలాన్‌ను ఆవిష్కరించి ఈ బృహత్ పథకానికి అంకురార్పణ చేశారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మరో 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు కొత్తగా కుళాయి కనెక్షన్లు అందించనున్నారు. ఇందుకోసం 13,075 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం, 77,243 కిలోమీటర్ల పైపులైన్ల విస్తరణ పనులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే రాష్ట్రంలో మొత్తం 3.3 కోట్ల మందికి సురక్షిత తాగునీరు అందుబాటులోకి వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఇప్పటికే 62 లక్షల కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు ఉండగా, ఈ కొత్త పథకంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

**రాయలసీమ రైజింగ్.. అభివృద్ధి ఆగదు**

ఈ సందర్భంగా ప్రొద్దుటూరులో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగించారు. రాయలసీమకు 'రప్పారప్పా' రాజకీయం కాదని, అభివృద్ధి, సంక్షేమం కావాలని స్పష్టం చేశారు. రాయలసీమ అభివృద్ధి బుల్లెట్‌లా దూసుకెళ్తుందని, దానిని ఎవరూ

మిగతా 2లో

రాజ్యసభ ఎన్నికలు: కేంద్ర మంత్రులకు

## బీజేపీ షాక్..

- యూపీ రాజ్యసభ ఎన్నికలకు 8 మంది అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ
- కేంద్ర మంత్రులు హర్దీప్ పురి, బీఎల్ వర్మలకు దక్కని అవకాశం
- పదవీకాలం ముగిసిన ఏ ఒక్క ఎంపీకి మళ్లీ టికెట్ ఇవ్వని అధిష్ఠానం
- 2027 ఎన్నికల లక్ష్యంగా సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యత



ఉత్తరప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అనూహ్య నిర్ణయం తీసుకుంది. పదవీకాలం ముగియనున్న ఇద్దరు కేంద్ర మంత్రులతో సహా ఏ ఒక్క సిట్టింగ్ ఎంపీకి తిరిగి అవకాశం కల్పించకుండా, ఎనిమిది మంది కొత్త ముఖాలను బరిలోకి దింపింది. ముఖ్యంగా కేంద్ర మంత్రులు హర్దీప్ సింగ్ పురి, బీఎల్ వర్మలను పక్కనపెట్టడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉత్తరప్రదేశ్ నుంచి ఖాళీ అవుతున్న 10 రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 16న పోలింగ్ జరగనుంది. అసెంబ్లీలోని బలాబలాల ప్రకారం బీజేపీ ఎనిమిది, సమాజ్‌వాదీ పార్టీ రెండు స్థానాలను గెలుచుకునే అవకాశం ఉంది.

మిగతాది 2లో

## ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీలు!

- అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థల ఏర్పాటుకు తెలంగాణ కీలక చర్యలు
- ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లు ఏర్పాటుకు ప్రత్యేక పాలసీ
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు
- 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'పైనా సమీక్ష

తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక పాలసీ రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్



2

## ఓటుకు నోటు కేసులో కీలక మలుపు..

- ఓటుకు నోటు కేసులో సుప్రీంకోర్టును ఆశ్రయించిన మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్
- ఈ కేసులో తనను ఇంప్లీడ్ చేయాలని పిటిషన్ దాఖలు
- బాధితుడిగా తన వాదనలు వినాలని కోర్టుకు విజ్ఞప్తి
- కేసును కొట్టివేయాలన్న రేవంత్ రెడ్డి పిటిషన్‌పై విచారణ వేళ ఈ పరిణామం
- పిటిషన్‌ను పరిగణనలోకి తీసుకున్న సుప్రీం, విచారణ వాయిదా



2

## సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నిర్ణయాలపై పిటిషన్లు..

**కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు**



- సీఈసీ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారంటూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం విచారణ
- కేంద్ర ప్రభుత్వం, ఈసీకి వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని నోటీసులు
- ఓటర్ల జాబితా సవరణ వంటి అంశాల్లో సీఈసీ ఒంటరిగా నిర్ణయాలు తీసుకున్నారని ఆరోపణ

ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ అధికారాల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు నేడు విచారణ చేపట్టింది. ఇతర కమిషనర్లతో సంప్రదించకుండా సీఈసీ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్లను స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం, ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి (ఈసీఐ) నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లోగా తమ స్పందన తెలియజేయాలని ఆదేశించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం

మిగతాది 2లో



2

## డీకే ముందే రైతు సంచలన ఫిర్యాదు!

- కర్ణాటకలో యువ రైతులకు పెళ్లిళ్లు కావడం లేదంటూ డీకేకు ఫిర్యాదు
- భూమి, ఇల్లు ఉన్నా అమ్మాయిలు ఇష్టపడటం లేదని యువరైతు ఆవేదన
- అమ్మాయిలు ఉద్యోగస్తులే కావాలంటున్నారని ఆరోపణ
- దీన్ని ఆరో గ్యారంటీగా స్వీకరించి పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

## 2029కి 4-స్టార్ స్కూళ్లు!

- ఏడాదిలోగా వన్-స్టార్ స్కూళ్లను టూ-స్టార్‌గా మార్చాలని ఆదేశం
- 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 4-స్టార్ సదుపాయాల కల్పన లక్ష్యం
- ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయం
- ఏజెన్సీ ప్రాంత పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచన



2

నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా చేరుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్-స్టార్ పాఠశాలలన్నింటినీ టూ-స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని

## హెచ్-1బీపై ట్రంప్ సర్కార్ షాక్!




**విదేశీ వర్క్ వీసాలపై ఈ వారంలో కఠిన చర్యలకు ట్రంప్ సర్కార్ సిద్ధం**

- అమెరికన్ ఉద్యోగాలకే తొలి ప్రాధాన్యమంటూ కార్మిక శాఖ ఉన్నతాధికారి సంకేతం
- ఇప్పటికే హెచ్-1బీ వీసాలపై పలు ఆంక్షలు విధించిన ట్రంప్ యంత్రాంగం

అమెరికాలో విదేశీయులకు జారీ చేసే ఉద్యోగ వీసా కార్యక్రమాలపై ట్రంప్ యంత్రాంగం తన వైఖరిని మరింత కఠినతరం చేయనుంది. ముఖ్యంగా హెచ్-1బీ వంటి వీసాలపై పర్యవేక్షణను తీవ్రతరం చేస్తూ ఈ వారంలోనే కీలక చర్యలు తీసుకోబోతున్నట్లు అమెరికా కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆంథోనీ డి'ఎస్పోసిటో స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఈ పరిణామంతో విదేశీ ఉద్యోగులలో, వారిపై ఆధారపడిన

మిగతాది 2లో

## భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు




2

- భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్దత ఏర్పడిందన్న నిర్మలా సీతారామన్
- ప్రస్తుతం వాణిజ్యం భారత్‌కే అనుకూలంగా ఉందని వెల్లడి
- వాణిజ్య లోటును తగ్గించుకోవాలని అమెరికా భావిస్తోందని వ్యాఖ్య

# హెచ్-1బీపై ట్రంప్ సర్కార్ షాక్!

తీవ్రతరం చేస్తూ ఈ వారంలోనే కీలక చర్యలు తీసుకోబోతున్నట్లు అమెరికా కార్మిక శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆంథోనీ డి'ఎస్పోసిటో స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఈ పరిణామంతో విదేశీ ఉద్యోగులలో, వారిపై ఆధారపడిన కంపెనీలలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

ఆంథోనీ డి'ఎస్పోసిటో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా చేసిన ఒక పోస్ట్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. "ఈ వారం విదేశీ లేబర్ వీసాల విషయంలో చాలా కీలకమైనది. మేము ఈ అంశాన్ని సరికొత్త స్థాయికి తీసుకెళ్తున్నాం. అమెరికన్ ఉద్యోగాలు.. అమెరికన్ కార్మికులు" అని ఆయన పేర్కొన్నారు.

అయితే, ఏయే వీసా కార్యక్రమాలను లక్ష్యంగా చేసుకుంటున్నారో, ఏ కంపెనీలపై చర్యలు ఉంటాయో? లేదా ఎలాంటి దర్యాప్తులు చేపట్టనున్నారో? ఆయన తన పోస్ట్‌లో స్పష్టంగా వెల్లడించలేదు. ఈ ప్రకటన రాబోయే చర్యల తీవ్రతను సూచిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు.

ఇది ట్రంప్ ప్రభుత్వం కొంతకాలంగా అనుసరిస్తున్న విస్తృత విధానంలో భాగమే. ఉపాధి ఆధారిత వలస విధానాలను కఠినతరం చేయడంపై, ముఖ్యంగా హెచ్-1బీ వీసా కార్యక్రమంపై, ట్రంప్ సర్కార్ మొదటి నుంచి దృష్టి సారించింది. సెప్టెంబర్‌లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక కీలక కార్యనిర్వాహక ఉత్తర్వుపై (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్) సంతకం చేశారు. దీని ప్రకారం హెచ్-1బీ వీసాల కోసం దరఖాస్తు చేసుకునే కంపెనీలు.. అదే విధమైన నైపుణ్యాలు కలిగిన అమెరికన్ ఉద్యోగులను ఇటీవల తొలగించాయా లేదా తొలగించే ప్రణాళికలో ఉన్నాయా అనే విషయాన్ని సంబంధిత ఏజెన్సీలు తప్పనిసరిగా సమీక్షించాలని ఆదేశించారు.

దీనికి అనుబంధంగా, అమెరికా వెలుపల ఉన్న కార్మికులకు సంబంధించిన కొన్ని ప్రత్యేక హెచ్-1బీ పిటిషన్లపై విధించే లక్ష డాలర్ల ఫీజు ఆవశ్యకతను 2027 సెప్టెంబర్ వరకు పొడిగిస్తూ మరో ప్రకటన జారీ చేశారు. ఈ చర్యల ద్వారా వీసా ప్రక్రియను మరింత నియంత్రించి, అమెరికన్ ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడాలనేది ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది.

హెచ్-1బీ పూర్తిగా విఫలమైన విధానం: జేడీ వాన్స్

ప్రభుత్వంలోని కీలక వ్యక్తులు కూడా ఇదే తరహా అభిప్రాయాలను బలంగా వినిపిస్తున్నారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ హెచ్-1బీ వీసా కార్యక్రమాన్ని పూర్తిగా విఫలమైనదిగా అభివర్ణించారు. కొన్ని కంపెనీలు అమెరికన్ ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో తక్కువ జీతాలకు పనిచేసే విదేశీ కార్మికులను నియమించుకోవడానికి ఈ వీసాలను ఒక సాధనంగా వాడుకుంటున్నాయని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ఈ విధానంలోని లోపాలను సరిదిద్దడానికే తమ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు. మొత్తం మీద, విదేశీ వీసా కార్యక్రమాలలో జరుగుతున్నాయని ఆరోపిస్తున్న దుర్వినియోగాన్ని అరికట్టి, అమెరికన్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంపై ట్రంప్ యంత్రాంగం పూర్తి స్థాయిలో దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది.

### సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నిర్ణయాలపై పిటిషన్లు..

# కేంద్రం, ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఫారం 6లో మార్పులు వంటి పలు కీలక నిర్ణయాలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ మిగతా ఇద్దరు కమిషనర్ల ఆమోదం లేకుండా ఏకపక్షంగా తీసుకున్నారని పిటిషనర్లు ఆరోపించారు. ఎన్నికల సంఘం వంటి బహుళ సభ్యుల కమిషన్‌లో నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీ ప్రాతిపదికన జరగాలని, కానీ ఇక్కడ అలా జరగలేదని వారు కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, ఈసీ తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తామని స్పష్టం చేసింది. "రాజ్యాంగబద్ధమైన సంస్థలు చట్టానికి లోబడి పనిచేయాలి. ఒకవేళ తీసుకున్న నిర్ణయాలు చట్టవిరుద్ధమని తేలితే, వాటిని రద్దు చేస్తాం" అని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. అయితే, సీఈసీగా జ్ఞానేశ్ కుమార్ విధులకు ఆటంకం కలిగించేలా లేదా ఆయనను సస్పెండ్ చేసేలా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి కోర్టు నిరాకరించింది.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలను సీఈసీ ఒక్కరే కాకుండా, ముగ్గురు సభ్యుల కమిషన్ సంయుక్తంగా వినియోగించేలా ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్లు తమ పిటిషన్‌లో కోరారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు నోటీసులతో ఈ వ్యవహారంపై కేంద్రం, ఈసీ ఎలాంటి వివరణ ఇస్తాయనేది ఆసక్తికరంగా మారింది.

# 2029కి 4-స్టార్ స్కూళ్లు!

లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో



వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్-స్టార్ పాఠశాలలన్నింటినీ టూ-స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుత విద్యా సంవత్సరంలోగా జీరో-స్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలలన్నింటినీ కనీసం వన్-స్టార్ స్థాయికి చేర్చాలని సూచించారు. 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4-స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, కనీసం వెయ్యి పాఠశాలలను 5-స్టార్ స్థాయికి చేర్చేలా పటిష్ఠ ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 "లీప్ స్కూళ్లను" అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు.

ప్రస్తుతం రాష్ట్రంలో 1,685 వన్-స్టార్... 15,618 టూ-స్టార్... 19,099 త్రీ-స్టార్... 7,172 ఫోర్-స్టార్ పాఠశాలలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్‌పీలకు బాధ్యతలు అప్పగించాలని లోకేశ్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున, ఇకపై అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిగా అభ్యసన ఫలితాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట

విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ద్వారా ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీమ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. నిరుద్యోగ యువతను "నైపుణ్యం పోర్టల్" పరిధిలోకి తీసుకువచ్చి, ఏఐ సాంకేతికత ద్వారా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాలన్నారు. సీడాప్, ఓంక్యాప్‌ల ద్వారా జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణనిచ్చి, విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో మానవ వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా, రాష్ట్ర విద్యా మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ సీఈవో నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# 27 లక్షల ఇళ్ల దాహం తీర్చే జలధార!

బుల్లెట్‌లా దూసుకెళ్తుందని, దానిని ఎవరూ ఆపలేరని



అన్నారు. రూ.1 లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేసి సీమ దశ, దిశ మారుస్తామని ప్రకటించారు. భవిష్యత్తులో శత్రు దేశాలను చీల్చిచెండాడే ఫైటర్ జెట్లు 'మేడ్ ఇన్ రాయలసీమ' అని చెప్పుకునే రోజులు వస్తాయని, ఇక్కడ పండే ఫలాలు 'రాయలసీమ బ్రాండ్'తో ప్రపంచ మార్కెట్లకు ఎగుమతి అవుతాయని ధీమా వ్యక్తం చేశారు. రానున్న గోదావరి పుష్కరాల లోపే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని మోదీ చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని పునరుద్ఘాటించారు.



గొడ్డలి పార్టీపై తీవ్ర విమర్శలు

గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 2024 ఎన్నికల్లో ప్రజలు గొడ్డలి పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పారని వ్యాఖ్యానించారు. వివేకా హత్య కేసు నుంచి మద్యం కుంభకోణం వరకు అన్ని వేళ్లూ ఆ పార్టీ అధినేత వైపే చూపిస్తున్నాయని ఆరోపించారు. కుట్రలు, ఫేక్ ప్రచారమే ఆ పార్టీ సిద్ధాంతమని, వారి డీఎన్‌ఏలోనే నేరాలు చేసి ఇతరులపై నెట్టేయడం ఉందని ఎద్దేవా చేశారు. అసెంబ్లీకి రాకుండా ప్రతిపక్ష హోదా కోరడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

కేంద్రం, రాష్ట్రంతో పాటు స్థానిక సంస్థల్లోనూ కూటమి అధికారంలో ఉంటే 'ట్రిపుల్ ఇంజిన్ సర్కార్'తో అభివృద్ధి వేగవంతం అవుతుందని సీఎం చంద్రబాబు అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎస్.సవిత, పి.నారాయణ, బీసీ జనార్దన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# భారత్-అమెరికా వాణిజ్య చర్చల పై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

భారత్, అమెరికాల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతిష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన 'మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్ 2026'లో ఆమె మాట్లాడారు. "వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాలు పట్టుదలగా చర్చలు జరిపాయి. ప్రస్తుతం ఇచ్చిపుచ్చుకునే ధోరణికి అతీతంగా చర్చలను ముందుకు తీసుకెళ్లడం కష్టతరంగా మారింది" అని ఆమె అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలను ఇరుపక్షాలు అన్వేషించవచ్చని సూచించారు. భారత్‌తో వాణిజ్యం వల్ల తమకు ఏళ్లుగా నష్టం జరుగుతోందన్న అమెరికా ఆందోళన ఈ చర్చల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 2026లో ప్రకటించిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ముసాయిదా ప్రాతిపదికన ఈ చర్చలు కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ఒక విజయవంతమైన ఉదాహరణగా పేర్కొన్నారు. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ అభివర్ణించినట్లుగా ఇది 'తల్లి లాంటి ఒప్పందం' అని ఆమె కొనియాడారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ 92.5 శాతం టారిఫ్ లైన్లను, 97 శాతం వాణిజ్య విలువను అందుబాటులోకి తెస్తే, ఈయూ తన వైపు నుంచి 97 శాతం టారిఫ్ లైన్లను, 99 శాతం వాణిజ్య విలువను విముక్తం చేసిందని ఆమె వివరించారు.

## రాజ్యసభ ఎన్నికలు: కేంద్ర మంత్రులకు బీజేపీ షాక్..

ద

(మొదటి పేజీ తరువాయి)

ఒక్క సిట్టింగ్ ఎంపీకి తిరిగి అవకాశం కల్పించకుండా, ఎనిమిది మంది కొత్త ముఖాలను బరిలోకి దింపింది. ముఖ్యంగా కేంద్ర మంత్రులు హర్దీప్ సింగ్ పురి, బీఎల్ వర్మలను పక్కనపెట్టడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉత్తరప్రదేశ్ నుంచి ఖాళీ అవుతున్న 10 రాజ్యసభ స్థానాలకు అక్టోబర్ 16న పోలింగ్ జరగనుంది. అసెంబ్లీలోని బలాబలాల ప్రకారం బీజేపీ ఎనిమిది, సమాజ్‌వాదీ పార్టీ రెండు స్థానాలను గెలుచుకునే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బీజేపీ తన ఎనిమిది మంది అభ్యర్థుల జాబితాను సోమవారం విడుదల చేసింది. ధర్మపాల్ సింగ్, రాధాకాంత్ ఓఝా, ప్రకాశ్ పాల్, విద్యాసాగర్ సోన్‌కర్, గోపీ కృష్ణ పాండే, ప్రియాంక సింగ్ రావత్, రామ్ ప్రతాప్ సింగ్ చౌహాన్, శ్రుతి గంగ్వార్‌లను అభ్యర్థులుగా అధిష్ఠానం ప్రకటించింది.

2027 ఎన్నికలే లక్ష్యంగా ఎంపిక

2027లో జరగనున్న ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీజేపీ ఈ అభ్యర్థులను ఎంపిక చేసినట్లు స్పష్టమవుతోంది. సామాజిక సమీకరణాలతో పాటు పార్టీ సంస్థాగత అనుభవానికి ఇందులో పెద్దపీట వేశారు. ఈ జాబితాలో ముగ్గురు ఓబీసీ, ఇద్దరు షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ), ముగ్గురు అగ్రవర్ణాల అభ్యర్థులు ఉన్నారు. వీరిలో ఇద్దరు మహిళలకు అవకాశం కల్పించడం విశేషం. బారాబంకి మాజీ ఎంపీ ప్రియాంక సింగ్ రావత్, ఝార్ఖండ్ గవర్నర్ సంతోష్ గంగ్వార్ కుమార్తె శ్రుతి గంగ్వార్‌లను మహిళా అభ్యర్థులుగా ఎంపిక చేశారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాశ్ పాల్, ప్రముఖ దళిత నేత, మాజీ ఎంపీ విద్యాసాగర్ సోన్‌కర్, అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రెండుసార్లు పనిచేసిన రాధాకాంత్ ఓఝా వంటి వారికి ఈ జాబితాలో చోటు దక్కింది. ఈ నిర్ణయంతో పార్టీలో కింది స్థాయి నుంచి పనిచేస్తున్న వారికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు బీజేపీ సంకేతాలు పంపింది.

## డీకే ముందే రైతు సంచలన ఫిర్యాదు!

(మొదటి పేజీ తరువాయి)

కర్ణాటకలో ఓ యువరైతు డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు చేసిన ఓ విజ్ఞప్తి ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. గ్రామాల్లో యువ రైతులకు పెళ్లిళ్లు కావడం లేదని, ఈ తీవ్రమైన సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని ఆయన కోరడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ సంభాషణకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మైసూరు జిల్లాలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న ఓ యువరైతు, తమ గోడును నేరుగా డీకే శివకుమార్ ముందుంచారు. "గ్రామాల్లో యువకులకు సొంత ఇళ్లు, పొలాలు ఉండి, కష్టపడి పనిచేస్తున్నా పెళ్లిళ్లు కావడం లేదు. అమ్మాయిలు, వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఉద్యోగులు, ఎక్కువ జీతం వచ్చే వారినే కోరుకుంటున్నారు. దీంతో 30, 40 ఏళ్లు దాటినా చాలా మంది బ్రహ్మచారులుగానే మిగిలిపోతున్నారు. ఈ మానసిక వేదనతో కొందరు ఆత్మహత్యలకు కూడా పాల్పడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు గ్యారంటీలు ఇచ్చినట్లే, మా పెళ్లిళ్ల సమస్యను ఆరో గ్యారంటీగా భావించి పరిష్కరించాలి" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యువరైతు వినతికి డీకే శివకుమార్ మొదట ఆశ్చర్యపోయినా, ఆ తర్వాత అతడు చెప్పేది శ్రద్ధగా విన్నారు. సభలో కొందరు నవ్వడంతో, ఇది నవ్వుకోవాల్సిన విషయం కాదని, తీవ్రమైన సామాజిక సమస్య అని వారికి సూచించారు. మారుతున్న సామాజిక ప్రాధాన్యతలు, పట్టణ జీవనశైలి ప్రభావం, ఉద్యోగాల స్వరూపం వంటివి వివాహ నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ వీడియో వైరల్ కావడంతో, వ్యవసాయంపై యువతలో తగ్గుతున్న ఆసక్తి, గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు వంటి అంశాలపై విస్తృత చర్చ జరుగుతోంది. మంచి ఆస్తులున్న భూస్వాములకు కూడా ఇలాంటి ఇబ్బందులు తప్పడం లేదని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

## ఓటుకు నోటు కేసులో కీలక మలుపు..

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 2015 నాటి ఓటుకు నోటు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారు, నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన సర్వోన్నత న్యాయస్థానంలో ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా అదనపు వాదనలు వినిపించేందుకు తనకు అవకాశం కల్పించాలని స్టీఫెన్‌సన్ తన పిటిషన్‌లో కోరారు. ప్రధాన ఫిర్యాదుదారుగా తన వాదనలను వినడం నిష్పక్షపాత విచారణకు అత్యంత కీలకమని ఆయన తరపు న్యాయవాది కోర్టుకు నివేదించారు. ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంటూ, తదుపరి విచారణను వాయిదా వేసింది. 2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల సందర్భంగా ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టీడీపీ అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేసేందుకు అప్పటి టీడీపీ ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి (ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి) రూ. 50 లక్షలు అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ ఏసీబీ కేసు నమోదు చేసి రేవంత్ రెడ్డి సహా ముగ్గురిని అరెస్ట్ చేయడంతో పాటు నగదును స్వాధీనం చేసుకుంది. ఈ కేసులో ఆడియో, వీడియో రికార్డింగులను కీలక ఆధారాలుగా పేర్కొన్నారు. తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగుతున్న తరుణంలో స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. తాజా పరిణామాలతో తెలుగు రాష్ట్రాల రాజకీయ, న్యాయ వర్గాల్లో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది. తదుపరి విచారణలో ధర్మాసనం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనన్న ఉత్కంఠ నెలకొంది.

# ఫ్యూచర్ సిటీలో విదేశీ వర్సిటీలు!

తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి విద్యా సంస్థలను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోంది. ఫ్యూచర్ సిటీలో ప్రముఖ విదేశీ యూనివర్సిటీల క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక పాలసీ రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. తెలంగాణను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా చర్యలు వేగవంతం చేయాలని సూచించారు.

ఇప్పటికే యూనివర్సిటీ ఆఫ్ లండన్, యూనివర్సిటీ ఆఫ్ బర్మింగ్‌హామ్‌తో పాటు మరో నాలుగు అంతర్జాతీయ యూనివర్సిటీలు ఫ్యూచర్ సిటీలో క్యాంపస్‌లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపినట్లు అధికారులు సీఎస్‌కు తెలిపారు.

విదేశీ వర్సిటీలను ఆహ్వానించడం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, పెట్టుబడులకు అవకాశం కల్పించడం, అనుమతులు సులభతరం చేయడం, విద్యా కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలను పాలసీలో చేర్చాలని సంజయ్ జాజు సూచించారు. తెలంగాణ విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ప్రతిపాదిత వర్సిటీల ప్రతినిధులతో చర్చలు జరిపి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ నాటికి ఈ ప్రణాళిక సిద్ధంగా ఉండాలని సూచించారు.

ఇదే సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మిస్తున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్'పైనా సమీక్షించారు. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దశలవారీగా ఈ పాఠశాలలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 2027 డిసెంబర్ నాటికి 67 పాఠశాలలను పూర్తి చేయాలని, 2028 జూన్ నాటికి ఈ సంఖ్యను 87కి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో పాఠశాలను సుమారు 26 ఎకరాల్లో నిర్మించనున్నారు. క్రీడా మైదానాలు, హాస్టళ్లు, సిబ్బంది క్వార్టర్లు, ఆధునిక వంటశాలలు, డిజిటల్ తరగతి గదుల వంటి సదుపాయాలు కల్పించనున్నారు. నిర్మాణ పనులను క్రమం తప్పకుండా సమీక్షించి, నాణ్యతతో నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సీఎస్ ఆదేశించారు.

## మహానందీశ్వరుని సన్నిధిలో ఆర్డీవో



మహానంది, పల్లె వెలుగు మహానంది పుణ్యక్షేత్రంలో నంద్యాల నూతన ఆర్డీవో మనిషా పూజలు నిర్వహించారు. సోమవారం క్షేత్రానికి వచ్చిన ఆమెకు తహశీల్దార్ పి.రమాదేవి స్వాగతం పలికారు. శ్రీ కామేశ్వరి దేవి సమేత మహానందీశ్వర స్వామి అమ్మవార్లను దర్శించుకొని అభిషేకం కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. పూజల అనంతరం ఆలయ పర్యవేక్షకులు శశిధర్ రెడ్డి జ్ఞాపికతో సత్కరించగా, వేద పండితులు వేద ఆశీర్వచనాలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు.

## సంస్కృతి సాంప్రదాయ పరిరక్షణలో అర్చకులదే ప్రాధాన్యత





మహానంది, పల్లె వెలుగు సంస్కృతి సాంప్రదాయ పరిరక్షణలో అర్చకులదే ప్రాధాన్యత అని రాష్ట్ర దేవాలయాల పాలన సంస్థ సీతా డైరెక్టర్ ముక్తేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం మహానంది లోని తిరుమల తిరుపతి కళ్యాణ మండపంలో అర్చకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని మహానంది దేవస్థానం చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర రెడ్డి, ఈవో శ్రీనివాసరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. చైర్మన్ నరాల చంద్రమౌళీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. సనాతన ధర్మాన్ని, శాస్త్ర సాంప్రదాయాలను వారసత్వ సంపదగా కాపాడుతూ భావి తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆలయాల్లో నిత్యం నిర్వహించే కైంకర్యాలను మరింత శుద్ధిగా, నియమబద్ధంగా నిర్వహించేందుకు ఈ తరగతులు దోహదపడతాయని ఆయన ఆకాంక్షించారు. ఆలయాల్లో నిత్యం జరిగే పూజా కార్యక్రమాలు ఎంతో ప్రధానమైనవి అన్నారు. ఐదు రోజులపాటు శైవ ఆగమన శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల
## అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం.

**ఇందిరానగర్‌లో 'సేవా సంకల్ప అభియాన్--అంగన్వాడీ ఉత్సవ్'.**

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని టీడీపీ ఇన్‌చార్జ్ కే. మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు



ఇందిరానగర్ టీడీపీ ఇన్‌చార్జ్, అడ్వకేట్ ఐసీ రామకృష్ణ ఆధ్వర్యంలో ఇందిరానగర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో 'సేవా సంకల్ప అభియాన్--అంగన్వాడీ ఉత్సవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న సేవలు, కేంద్రం నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. చిన్నారులకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్య, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని నిర్వాహకులు వివరించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు అందుతున్న సేవలను మరింత బలోపేతం చేయడానికి ప్రజల సహకారం అవసరమని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## మనస్సుపై నియంత్రణతోనే విజయానికి బాట..



పాణ్యం అక్టోబర్ 05 పల్లె వెలుగు : శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో బేసిక్ సైన్సెస్ విభాగం,ఐక్యు ఏసిఆధ్వర్యంలో 'ఆర్ట్ ఆఫ్ మైండ్ కంట్రోల్' అంశంపై సోమవారం వ్యక్తిత్వ వికాస కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.వి. సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రత, మానసిక ప్రశాంతత, సానుకూల ఆలోచనలు, భావోద్వేగ సమతుల్యతను పెంపొందించుకోవాలని సూచించారు. విభాగాధిపతి డా. బి. శేషయ్య మాట్లాడుతూ వ్యక్తిగత, విద్యా, వృత్తిపరమైన అభివృద్ధిలో మానసిక నియంత్రణ కీలకమన్నారు. ముఖ్య వనరుల వ్యక్తి శ్రీ హరి (జహ్నుద్వీప నితై దాస్) మాట్లాడుతూ ప్రతికూల ఆలోచనలు, అనవసర ఆందోళనలను అధిగమించి స్పష్టమైన లక్ష్యాలతో క్రమశిక్షణతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. వైఫల్యాలను పాఠాలుగా తీసుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చురుకుగా పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

# నంద్యాల పట్టణంలో పాఠశాలలను
## ఆకస్మికంగా తనిఖీ చేసిన రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్.

**☛విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, మౌలిక వసతుల పరిశీలన.**

**☛మంత్రి ఫరూక్ ప్రశ్నలకు చక్కగా సమాధానమిచ్చిన 10వ తరగతి విద్యార్థిని లక్ష్మీ ప్రసన్న కు సన్మానం.**

పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి మరింత బలోపేతం చేసే కార్యాచరణలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్ సోమవారం నంద్యాల పట్టణంలోని పలు పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

పట్టణంలోని హోలీ క్రాస్ హైస్కూల్, ఖలీల్ సిద్ధికి హైస్కూల్, సిద్ధికి ఎయిడెడ్ ప్రైమరీ స్కూల్ తదితర మూడు పాఠశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులతో మాట్లాడి విద్యార్థుల హాజరు, పాఠశాల రోజువారీ నిర్వహణ మరియు ఎదుర్కొంటున్న సమస్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లోని విద్యార్థులతో మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలించి



ముఖాముఖి మాట్లాడిన మంత్రి ఫరూక్ , వారి అభ్యసన స్థాయిలను తెలుసుకునేందుకు పలు ప్రశ్నలు వేశారు. ఖలీల్ సిద్ధికి హైస్కూల్ సందర్శన సందర్భంగా పదో తరగతి చదువుతున్న విద్యార్థిని లక్ష్మీ ప్రసన్నను మంత్రి ఫరూక్ పలు ప్రశ్నలు అడగగా, ఆ విద్యార్థిని ఏమాత్రం తడబడకుండా పుస్తకంలోని అంశాలను సమగ్రంగా వివరించింది. విద్యార్థిని ప్రతిభకు, ధైర్యానికి ముగ్ధుడైన మంత్రి ఫరూక్ , ఆమెను ప్రత్యేకంగా అభినందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం నాణ్యమైన భోజనం విద్యార్థినిలకు అందిస్తున్నారా లేదా అని పరిశీలించాడు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగ సమగ్ర అభివృద్ధికి, నాణ్యమైన విద్యాబోధనకు కట్టుబడి ఉందని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరచడమే లక్ష్యంగా ఇటువంటి క్షేత్రస్థాయి పర్యవేక్షణలు నిరంతరం కొనసాగుతాయని మంత్రి ఫరూక్ తెలిపారు . పాఠశాలల సమస్యలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సకాలంలో తగిన దిద్దుబాటు చర్యలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

## పాఠశాల పక్కనే రైస్ గోడౌన్.. తరలించాల్సిందే!

**● విద్యార్థులు, రైతుల ఇబ్బందులు పట్టించుకోకపోతే ఆందోళన తప్పదు.**

**● ఆర్డీవో అరుణాదేవికి డీఎస్ఎఫ్ నేతల వినతిపత్రం.**

ఆదోని (పల్లె వెలుగు): ధనాపురం గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన సివిల్ సప్లై రైస్ గోడౌన్‌ను పాఠశాలలు, నివాస ప్రాంతాలకు దూరంగా మరో అనువైన ప్రదేశానికి తరలించాలని డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ (డీఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆదోని ఆర్డీవో కే. అరుణాదేవికి డీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయ్ వెంకటేష్ కిరణ్ మాట్లాడుతూ.. ధనాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన సివిల్ సప్లై రైస్ గోడౌన్‌కు సమీపంలోనే పాఠశాల ఉండటంతో పాటు గ్రామ ప్రజలు నివాసం ఉంటున్నారని తెలిపారు. గోడౌన్‌లో బియ్యం నిల్వ చేయడం వల్ల బియ్యంలో ఉండే పురుగులు, ఇతర కీటకాలు పాఠశాల పరిసరాల్లోకి చేరి విద్యార్థులకు ఇబ్బందులు కలిగించే అవకాశం ఉందన్నారు.

అదేవిధంగా గోడౌన్‌కు సమీపంలో పంట పొలాలు ఉన్నాయని, బియ్యం రవాణా కోసం లారీలు రాకపోకలు సాగించడం వల్ల దుమ్ము, ధూళి ఏర్పడి విద్యార్థులు, రైతులు, గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందన్నారు. ముఖ్యంగా పాఠశాల సమీపంలో భారీ వాహనాల






రాకపోకలు విద్యార్థుల భద్రతకు కూడా సమస్యగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు.

గతంలో ధనాపురం గ్రామానికి ఊరవతల నాగనాతనహళ్లి రహదారిలో సివిల్ సప్లై రైస్ గోడౌన్ ఉండేదని, అప్పట్లో ప్రజలకు పెద్దగా ఇబ్బందులు ఉండేవి కావని తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో, పాఠశాలకు సమీపంలో గోడౌన్ ఏర్పాటు చేయడంతో విద్యార్థులు, రైతులు, గ్రామ ప్రజలకు అనేక సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు.

విద్యార్థులు, రైతులు, గ్రామ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పాఠశాలకు, నివాస ప్రాంతాలకు దూరంగా సివిల్ సప్లై రైస్ గోడౌన్‌ను మరో అనువైన ప్రదేశానికి తక్షణమే మార్చాలని అధికారులను డీఎస్ఎఫ్ నాయకులు కోరారు.

గోడౌన్‌ను మరోచోటికి తరలించకపోతే రానున్న రోజుల్లో విద్యార్థులను కలుపుకొని సివిల్ సప్లై రైస్ గోడౌన్ ఎదుట ధర్నా చేపట్టి ఆందోళనను ఉధృతం చేస్తామని డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉదయ్ వెంకటేష్ కిరణ్ హెచ్చరించారు.

## ఎస్సీ హాస్టల్‌పై ఎస్ఎఫ్ఐ పోరాటం.. స్పందించిన అధికారులు.

**హాస్టల్‌ను తనిఖీ చేసిన ఆర్డీవో.. విద్యార్థుల సమస్యలపై ఆరా.**
**నాణ్యమైన భోజనం అందించడంలో విఫలమైన వార్డెన్‌పై విచారణ జరపాలి: ఎస్ఎఫ్ఐ.**



ఆదోని (పల్లె వెలుగు): ఆదోని పట్టణంలోని ఎస్సీ నంబర్--1 హాస్టల్‌లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనకు అధికారులు స్పందించారు. సోమవారం ఆర్డీవో కే. అరుణాదేవి హాస్టల్‌ను స్వయంగా తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఇటీవల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ఖాళీ ప్లేట్లతో ధర్నా నిర్వహించి హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం, కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హాస్టల్‌ను తనిఖీ చేసిన ఆర్డీవో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు తమకు ఉడకని అన్నం వడ్డిస్తున్నారని, గత పది రోజులుగా గుడ్డు అందించడం లేదని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. భోజన నాణ్యతను పరిశీలించిన ఆర్డీవో అసంతృప్తి వ్యక్తం చేస్తూ విద్యార్థుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అలాగే హాస్టల్‌లోని బాత్రూమ్‌లకు డోర్లు ఏర్పాటు చేసుకునేందుకు విద్యార్థుల నుంచే వందల రూపాయలు వసూలు చేశారని, బాత్రూమ్‌లను కూడా విద్యార్థులే శుభ్రం చేసుకోవాల్సి వస్తోందని వారు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా హాస్టల్‌కు సంబంధించిన బియ్యం బస్తాలను వార్డెన్ ఇంటికి తీసుకెళ్తున్నారనే ఆరోపణను కూడా విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

**పూర్తిస్థాయి విచారణ జరపాలి**

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ.. విద్యార్థులు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను పరిగణనలోకి తీసుకుని పూర్తిస్థాయి నివేదికను రూపొందించి జిల్లా కలెక్టర్‌కు పంపాలని ఆర్డీవోను కోరారు. విద్యార్థులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హాస్టల్‌లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో నిర్లక్ష్యం జరిగిందన్న ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని, ఆరోపణలు నిజమని విచారణలో తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం, అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

విద్యార్థుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో హామీ ఇచ్చినట్లు శ్రీనివాసులు తెలిపారు.

# అమరావతి నగర్ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తాం.

**● మాట ఇచ్చాం.. నిలబెట్టుకుంటున్నాం: మాజీ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ. ● రూ.23.50 లక్షలతో 295 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ.**





ఆదోని (పల్లె వెలుగు): అమరావతి నగర్ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని మాజీ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ అన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ పార్థసారథి ఆదేశాల మేరకు అమరావతి నగర్‌లో రూ.23.50 లక్షల నిధులతో 295 మీటర్ల నూతన సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. మాజీ కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహమ్మద్, జనసేన పట్టణ అధ్యక్షుడు రేణువర్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. స్థానిక నాయకులు, మహిళలు, ప్రజలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెల్లాల లలితమ్మ మాట్లాడుతూ.. గత కౌన్సిలర్ ఎన్నికల సమయంలో ప్రచారానికి వచ్చినప్పుడు అమరావతి నగర్ ప్రజలు సీసీ రోడ్లు, డ్రైనేజీ సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని కోరగా, ఎన్నికల్లో గెలిచిన అనంతరం రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చామని చెప్పారు. కొన్ని కారణాల వల్ల అభివృద్ధి పనులు ప్రారంభించడంలో కొంత ఆలస్యం జరిగిందని, అందుకు అమరావతి నగర్ ప్రజలు తనను మన్నించాలని లలితమ్మ కోరారు. అయితే ఇచ్చిన మాటను నిలబెట్టుకునే దిశగా ప్రస్తుతం అభివృద్ధి పనులు ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. అమరావతి నగర్‌లో మిగిలిన సమస్యలను కూడా దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా భూమిపూజ కార్యక్రమానికి హాజరైన మహిళలు మాట్లాడుతూ.. ఆలస్యమైనా ఇచ్చిన మాటను నిలబెట్టుకుని సీసీ రోడ్డు పనులు ప్రారంభించడం ఆనందంగా ఉందని లలితమ్మకు కృతజ్ఞతలు తెలిపారు. తమ ప్రాంతంలో రోడ్డు నిర్మాణంతో ప్రజలకు రాకపోకల సమస్యలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కరువు జాబితాలో ఆదోని మండలం-2ను చేర్చాలి.

ఆదోని (పల్లె వెలుగు): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం





ప్రకటించిన కరువు మండలాల జాబితాలో ఆదోని మండలం-2ను చేర్చకపోవడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. సుమారు రెండు గంటలపాటు కార్యాలయం వద్ద నిరసన చేపట్టి, ఆదోని మండలం-2ను తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమానికి సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు బి. వీరారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి లింగన్న మాట్లాడుతూ.. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో సరైన వర్షాలు కురవకపోవడంతో పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. సాగు కోసం పెట్టిన పెట్టుబడులు సైతం తిరిగి రాని దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

పంటల బీమా కోసం రైతులు ఎకరాకు రూ.2 వేల వరకు చెల్లించినప్పటికీ, ఆదోని మండలం-2ను కరువు జాబితాలో చేర్చకపోవడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొందన్నారు. కరువు పరిస్థితులపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ శాఖ నిబంధనల ప్రకారం 21 రోజులపాటు వర్షాభావ పరిస్థితులు కొనసాగితే కరువుగా గుర్తించే అవకాశం ఉందని, ఈ పరిస్థితి రెండుసార్లు ఏర్పడినప్పటికీ జిల్లా అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు.

**రైతులకు తక్షణ సాయం అందించాలి**

ఆదోని మండలం-2ను తక్షణమే కరువు మండలంగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. రైతులకు ఎకరాకు రూ.50 వేల పంట నష్టపరిహారం చెల్లించాలని, రైతుల పంట రుణాలను పూర్తిగా మాఫీ చేయాలని కోరారు. అదేవిధంగా ఉపాధి హామీ పనులను 200 రోజులకు పెంచి రోజుకు రూ.700 వేతనం ఇవ్వాలని, పశువులకు ఉచితంగా పశుగ్రాసం అందించాలని డిమాండ్ చేశారు. కరువు పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు అర్హులైన పేదలందరికీ చౌకధరల దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులను ఉచితంగా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

**త్వరలో కరువు మండలంగా ప్రకటిస్తాం: అధికారులు**

రైతుల ఆందోళన నేపథ్యంలో ఆర్ఐ జోక్యం చేసుకుని వ్యవసాయ శాఖ ఏడీఏను పిలిపించారు. ఆందోళనకారులతో మాట్లాడిన ఏడీఏ.. ఆదోని మండలం-2ను కరువు జాబితాలో చేర్చాలని ఉన్నతాధికారులకు ఇప్పటికే నివేదికలు పంపినట్లు తెలిపారు. త్వరలోనే ఆదోని మండలం-2ను కరువు మండలంగా ప్రకటించే అవకాశం ఉందని హామీ ఇచ్చారు.

అనంతరం రైతులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఆదోని మండలం-2ను కరువు జాబితాలో చేర్చే వరకు సచివాలయాల ముట్టడి, రాస్తారోకో వంటి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీపీఎం నాయకులు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు భాష, మునిస్వామి, అయ్యన్న, శాఖ కార్యదర్శులు పరమేష్, శ్రీనివాసులు, పార్టీ సభ్యులు కృష్ణ, హనుమంతరెడ్డి, తాయన్న, మంజు, రామప్ప, ఏలియా, ఉలిగేష్, కేవీపీఎస్ మండల కార్యదర్శి తిక్కప్ప, డీవైఎఫ్ఐ మండల కన్వీనర్ వీరేష్‌తో పాటు పెద్దతుంబలం, కుప్పగల్లు, జాలిమంచి, పాండవగల్లు, గనేకల్లు, కడితోట, హానవాళ్, మధిరే, సంతేకుళ్లూరు, పెద్దహరివాణం, ధనాపురం, చిన్నహరివాణం తదితర గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ భరోసా.

**● 33 మంది బాధితులకు రూ.10.80 లక్షల చెక్కుల పంపిణీ. ● ఇప్పటివరకు 1,097 మందికి రూ.3.13 కోట్ల ఆర్థిక సాయం.**




ఆదోని (పల్లె వెలుగు): వైద్యపరమైన అత్యవసర పరిస్థితుల్లో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అండగా నిలుస్తున్నామని టీడీపీ సీనియర్ నాయకులు కొంకా ఉమాపతి నాయుడు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో, ఆదోని నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు ఆదోని పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 33 మంది బాధితులకు మొత్తం రూ.10,80,379 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కొంకా ఉమాపతి నాయుడు చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఉమాపతి నాయుడు మాట్లాడుతూ.. వైద్య చికిత్సల కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

ఆదోని నియోజకవర్గ ప్రజలకు వైద్యపరమైన అత్యవసర పరిస్థితుల్లో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందేలా మీనాక్షి నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

**1,097 కుటుంబాలకు రూ.3.13 కోట్ల సాయం**

మీనాక్షి నాయుడు సహకారంతో ఇప్పటివరకు ఆదోని నియోజకవర్గానికి చెందిన 1,097 మంది బాధితులకు మొత్తం రూ.3,13,80,379 సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించినట్లు ఉమాపతి నాయుడు తెలిపారు.

అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత..

పాణ్యం అక్టోబర్ 5 పల్లె వెలుగు : మండలంలోని గగ్గటూరు గ్రామానికి చెందిన కుమ్మరి సుబ్బరాయుడికి ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కింద రూ.56 వేల చెక్కు మంజూరైంది. చెక్కు మంజూరుకు కృషి చేసిన గ్రామ నాయకుడు సద్దల మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి సుబ్బరాయుడు కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రిలో చికిత్స కోసం అప్పులు చేసిన తన కుటుంబానికి ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం ఎంతో ఊరటనిచ్చిందని ఆయన పేర్కొన్నారు.



# ఆదోని--2కు కరువు దక్కదా?

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని మండలం--1ను కరువు మండలంగా ప్రకటించిన





ప్రభుత్వం, ఆదోని మండలం--2ను మాత్రం కరువు మండలాల జాబితాలో చేర్చకపోవడంపై రైతులు, గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పెద్ద హరివాణం గ్రామంలో రాస్తారోకో నిర్వహించి తమ నిరసనను తెలిపారు. వర్షాభావ పరిస్థితులతో పంటలు ఎండిపోతున్నాయని, సాగు కోసం పెట్టిన పెట్టుబడులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలం--1కు కరువు హోదా ఇచ్చినప్పుడు, అదే ప్రాంతంలో ఉన్న మండలం--2ను కరువు మండలంగా ఎందుకు ప్రకటించలేదని వారు ప్రశ్నించారు. పెద్ద హరివాణం ప్రధాన రహదారిపై రైతులు, గ్రామస్థులు బైఠాయించడంతో వాహనాల రాకపోకలు కొంతసేపు నిలిచిపోయాయి. కరువు పరిస్థితులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుల ఇబ్బందులను గుర్తించాలని వారు కోరారు. ఆదోని మండలం--2ను తక్షణమే కరువు మండలంగా ప్రకటించి, పంట నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించడంతో పాటు కరువు సహాయక చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి తమ సమస్యకు పరిష్కారం చూపే వరకు ఆందోళనలను కొనసాగిస్తామని వారు తెలిపారు.

## విద్యుత్ బిల్లుల చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి.

**-విద్యుత్ ఈఈ పురుషోత్తంను కోరిన సీపీఎం నాయకులు.**

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని పట్టణంలో విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు వినియోగదారులు



ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) పురుషోత్తంను కలిసి సమస్యపై చర్చించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ.. విద్యుత్ బిల్లుల చెల్లింపుల కోసం కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తోందని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, దూర ప్రాంతాల నుంచి వచ్చే వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వినియోగదారుల సౌకర్యార్థం విద్యుత్ బిల్లుల చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, రద్దీని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఈఈ పురుషోత్తంను కోరారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా బిల్లుల చెల్లింపు ప్రక్రియను సులభతరం చేయాలని విజ్ఞప్తి చేశారు. వినియోగదారుల సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఈఈ పురుషోత్తం హామీ ఇచ్చినట్లు సీపీఎం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, తిప్పన్న, ముక్కన్న తదితరులు పాల్గొన్నారు.

## బావాజీపేటలో పశువుల బెడద..

# పారిశుద్ధ్య సమస్యపై బీజేపీ ఫిర్యాదు

ఆదోని (పల్లె వెలుగు): ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని బావాజీపేట-1, 48వ వార్డులో చిన్న



శక్తిగుడి మైదానం, పెద్ద శక్తిగుడి మైదానాల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న పశువులను నియంత్రించి, పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ



మేరకు ఆదోని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. మైదానాల్లో పశువులు విచ్చలవిడిగా సంచరిస్తుండటంతో విద్యార్థులు, స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పశువుల పేడ మైదానాల్లో పేరుకుపోవడంతో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా మారుతోందని పేర్కొన్నారు. పశువుల యజమానులు వాటిని పట్టించుకోకపోవడంతో పారిశుద్ధ్య సిబ్బంది కూడా ఎప్పటికప్పుడు మైదానాలను శుభ్రం చేయడం ఇబ్బందిగా మారుతోందన్నారు. పేడ పేరుకుపోవడం వల్ల పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లడంతో స్థానిక ప్రజలకు అసౌకర్యం కలుగుతోందని తెలిపారు.

**విద్యార్థుల భద్రతపై దృష్టి సారించాలి**

ప్రజల ఆరోగ్యం, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు కోరారు. విచ్చలవిడిగా తిరుగుతున్న పశువులను నిబంధనల ప్రకారం నియంత్రించి, వాటి యజమానులు స్పందించని పక్షంలో సంబంధిత నిబంధనల మేరకు తదుపరి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, నిబంధనలకు అనుగుణంగా సాధ్యమైతే పశువులను సంరక్షించేందుకు సిద్ధంగా ఉన్న రైతులు లేదా గోశాలలకు అప్పగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను అత్యవసరంగా పరిశీలించి 48వ వార్డు ప్రజలు, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మాజీ కౌన్సిలర్, బీజేపీ కర్నూలు జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు ఏవీ సురేష్, నార్త్ మండల అధ్యక్షుడు వాల్మీకి మహదేవ్, నాయకులు వాల్మీకి చంద్ర, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేస్తాం: కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్

- ‘ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక’కు 109 అర్జీలు
- సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు ఆదేశం





పల్లె వెలుగు కర్నూలు బ్యూరో  ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందే ప్రతి అర్జీపై చట్ట ప్రకారం సమగ్ర విచారణ జరిపి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా చర్యలు తీసుకుంటామని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ స్పష్టం చేశారు. కర్నూలు కొత్తపేటలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజల నుంచి ఎస్పీ స్వయంగా అర్జీలు స్వీకరించి, బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 109 ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. బాధితుల సమస్యలపై పోలీసులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు.

ఎస్పీకి అందిన ప్రధాన ఫిర్యాదులు:

ఉద్యోగం పేరిట రూ. 3 లక్షలు మోసం: కాంట్రాక్ట్ బేసిస్‌పై ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి కర్నూలుకు చెందిన ఇనాయతుల్లా తన వద్ద రూ. 3 లక్షలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు మండలం బి. తాండ్రపాడుకు చెందిన రమేష్ వాపోయారు.

బంగారమని చెప్పి ఇత్తడి బిల్లలు: కర్నూలు రైల్వేస్టేషన్ వద్ద బంగారం ఇస్తామని చెప్పి రూ. 2 లక్షలు తీసుకుని, చిన్న చిన్న ఇత్తడి బిల్లలు ఇచ్చి మోసం చేసిన ఇద్దరు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని నంద్యాల బొమ్మలసత్రానికి చెందిన దయాశంకర్ ఫిర్యాదు చేశారు.

భూకబ్జా, బెదిరింపులు: స్టేట్ రిపోర్టర్, లాయర్ అని చెప్పుకుంటూ గ్యాంగ్‌తో కలిసి తన పొలాన్ని వదిలేయాలని బెదిరిస్తూ, నకిలీ సర్టిఫికెట్లు, అగ్రిమెంట్లు సృష్టించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మంత్రాలయం మండలం చిలకలడోణ గ్రామానికి చెందిన దాసరి మహేష్ విజ్ఞప్తి చేశారు.

ప్లాట్ పేరిట మోసం: ప్లాట్ అమ్మిస్తానని నమ్మబలికి అగ్రిమెంట్ పత్రాలపై సంతకాలు చేయించుకుని డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడని కోడుమూరు మండలం పులకుర్తి గ్రామానికి చెందిన నడిపి రంగన్న ఫిర్యాదు చేశారు.

కుమారుల వేధింపులు: కన్న కుమారులే తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని కర్నూలు వన్‌టౌన్ సున్నంబట్టీ వీధికి చెందిన నాగశేషమ్మ గోడు వెళ్లబోసుకున్నారు.

రక్షణ కల్పించాలని ఆర్జీ: తనపై, తన కుమారులపై బెదిరింపులకు పాల్పడుతున్న వారి నుంచి రక్షణ కల్పించాలని కర్నూలు ఖడక్‌పురాకు చెందిన జలీల్ అహ్మద్ కోరారు.

వచ్చిన ప్రతి ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) హుస్సేన్ పీరా, సీఐలు శివశంకర్, పార్థసారథి, మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

# పెద్ద హరివాణం అభివృద్ధికి రూ.2 కోట్లకు పైగా నిధులు.

- పల్లెల అభివృద్ధికి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ కృషి: మాన్వి దేవేంద్రప్ప.
- పల్లె పండుగ--3.0తో గ్రామ రూపురేఖలు మారనున్నాయి.





ఆదోని (పల్లె వెలుగు): గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఏపీ స్టేట్ కురుబ కురుమ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప అన్నారు. రాష్ట్రంలో పల్లెల అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ రథసారథులుగా పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ఆదోని మండలం పెద్ద హరివాణం మేజర్ పంచాయతీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు దాదాపు రూ.2 కోట్లకు పైగా నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు.

పల్లె పండుగ--1.0 కింద రూ.75 లక్షల పనులు, పల్లె పండుగ--2.0 కింద రూ.90 లక్షల అభివృద్ధి పనులు పూర్తయ్యాయని చెప్పారు.

ప్రస్తుతం పల్లె పండుగ--3.0 కింద రూ.45 లక్షల నిధులు మంజూరు కావడంతో పెద్ద హరివాణం గ్రామ రూపురేఖలు మరింత మారనున్నాయని తెలిపారు. గ్రామ ఈశాన్య దిశలోని రహదారి నిర్మాణ పనులను కూడా త్వరలో ప్రారంభిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు.

హెల్త్ సెంటర్‌కు రూ.25 లక్షలు

వైసీపీ పాలనలో ప్రారంభమై నిలిచిపోయిన హెల్త్ సెంటర్ పనులను పూర్తి చేసేందుకు రూ.25 లక్షలు మంజూరు చేసి పనులు పూర్తిచేసినట్లు మాన్వి దేవేంద్రప్ప తెలిపారు. పెద్ద హరివాణం గ్రామంలో బీసీ జనాభా అధికంగా ఉన్న నేపథ్యంలో రూ.25 లక్షలతో బీసీ మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ కూడా మంజూరు చేసినట్లు వెల్లడించారు.

రాబోయే రెండేళ్లలో పెద్ద హరివాణం మేజర్ పంచాయతీలో గ్రావెల్ రోడ్లు లేని ప్రాంతాల్లో అవసరమైన రోడ్లను నిర్మించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

రూ.1.50 కోట్లతో సరిహద్దు రహదారి పనులు ప్రారంభం

పెద్ద హరివాణం నుంచి కర్ణాటక వైపు వెళ్లే నాడంగ, అగసనూరు, రవిహాళ్లు, బీరల్లి, గుబ్బాళ్, కొత్తలచింత, బొమ్మనాళ్లు, హచ్చోళ్లి తదితర గ్రామాల ప్రజలకు ప్రధాన రహదారి ఇదేనని మాన్వి దేవేంద్రప్ప తెలిపారు. ఆంధ్రప్రదేశ్--కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఉండటంతో దాదాపు పాతికేళ్లుగా రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.1.50 కోట్ల నిధులు మంజూరు చేయడంతో, పెద్ద హరివాణం నుంచి ఆంధ్ర సరిహద్దు వరకు (నాడంగ రోడ్డు) రహదారి పనులు ప్రారంభమైనట్లు తెలిపారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసి స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ కృషి చేస్తున్నారని మాన్వి దేవేంద్రప్ప అన్నారు. పల్లె ప్రజల తరఫున వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీపీ బసవరాజు, సొసైటీ చైర్మన్ ఆది శేషారెడ్డి, జెడ్పీ స్కూల్ చైర్మన్ బీపీ ఐ, ఎల్ఎల్‌సీ కెనాల్ చైర్మన్ గురులింగ, లక్ష్మమ్మ చెరువు చైర్మన్ కుప్పం సోమ, మాజీ ఎంపీటీసీ ఎన్. నాగరాజు, కొటేకల్ నాగప్ప, బీజేపీ నాయకులు రంగనాథరెడ్డి, బోయ రాగప్ప, కటిక నర్సోజీరావు, జనసేన నాయకుడు వీరేష్ యాదవ్‌తో పాటు టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళలు, గిరిజన మహిళల ఉత్పత్తులకు ‘వనస్య’తో మెరుగైన మార్కెటింగ్.

**స్థానిక ఉత్పత్తులకు మార్కెట్.. మహిళలకు స్థిరమైన ఆదాయం కల్పించడమే లక్ష్యం: కలెక్టర్ రాజకుమారి గణియా.**



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. మహిళలు, గిరిజన మహిళలు, స్థానిక ఉత్పత్తిదారులు తయారు చేస్తున్న సహజసిద్ధమైన ఉత్పత్తులకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలు కల్పించి, వారి జీవనోపాధిని మరింత బలోపేతం చేయడమే ‘వనస్య ది ఎక్స్‌పీరియన్స్ సెంటర్’ ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలు ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ‘వనస్య ది ఎక్స్‌పీరియన్స్ సెంటర్’ను కలెక్టర్ సందర్శించి, అక్కడ ప్రదర్శనకు, విక్రయాలకు ఉంచిన వివిధ ఉత్పత్తులను పరిశీలించారు. ఉత్పత్తుల తయారీ, ధరలు, విక్రయాలు, మార్కెటింగ్ విధానం తదితర అంశాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో మహిళలు చేపడుతున్న జీవనోపాధి కార్యక్రమాలకు అవసరమైన మార్కెటింగ్ సహకారం అందించడం ద్వారా వారికి స్థిరమైన ఆదాయ అవకాశాలను కల్పించవచ్చని తెలిపారు. స్థానికంగా తయారయ్యే నాణ్యమైన ఉత్పత్తులకు ప్రత్యేక మార్కెటింగ్ వేదిక అందుబాటులోకి రావడం వల్ల మహిళా సంఘాలు, గిరిజన మహిళలు, చిన్నతరహా ఉత్పత్తిదారులు తమ ఉత్పత్తులను విస్తృత మార్కెట్‌కు చేరువ చేయగలుగుతారని పేర్కొన్నారు. ఉత్పత్తి నుంచి మార్కెటింగ్ వరకు మహిళా ఉత్పత్తిదారులకు అవసరమైన సహకారం అందించి, ‘వనస్య’ను సమర్థవంతమైన మార్కెటింగ్ వేదికగా అభివృద్ధి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రోజువారీ విక్రయాలకు మాత్రమే పరిమితం కాకుండా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, విద్యాసంస్థలు తదితర ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో ఆర్డర్లు వచ్చేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

జిల్లాలోని మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మరింత ప్రోత్సాహం కల్పించేలా సోవెనీర్ లేదా గిఫ్ట్ ప్యాక్‌లను స్థానిక మహిళా ఉత్పత్తులతోనే రూపొందించాలని కలెక్టర్ సూచించారు. ఇందుకోసం ఉత్పత్తుల ఎంపిక, ప్యాకేజింగ్, ధరలను నిర్ణయించి, స్థిరమైన రేట్లతో ప్రత్యేక గిఫ్ట్ ప్యాక్ నమూనాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. వనస్య సెంటర్‌లో మహిళలు తయారు చేస్తున్న జ్యువెలరీ, జూట్ బ్యాగులు, పౌచ్‌లు, అలంకరణ వస్తువులు, ఇతర హస్తకళా ఉత్పత్తులు అందుబాటు ధరల్లో లభిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాలు, వివిధ ఈవెంట్లలో వేదిక అలంకరణకు ఉపయోగించే బొమ్మలు , ఇతర అలంకరణ ఉత్పత్తులు కూడా మహిళా సంఘాల ద్వారా తయారు చేస్తున్నందున వాటిని విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. అలాగే అవసరానికి అనుగుణంగా జూట్ బ్యాగులు, పౌచ్‌లు తదితర ఉత్పత్తులను రెండు, మూడు రోజుల్లోనే ప్రత్యేక డిజైన్‌తో తయారు చేసి అందించే అవకాశం ఉందని తెలిపారు.

మహిళా ఉత్పత్తులకు విస్తృత ప్రచారం కల్పించి, ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు, విద్యాసంస్థల ద్వారా బల్క్ ఆర్డర్లు వచ్చేలా మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మెడికల్, పాలిటెక్నిక్ తదితర కళాశాలల్లో వనస్య ఉత్పత్తులపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ, అధికారిక కార్యక్రమాల్లో బొకేలు, షాల్స్‌కు బదులుగా స్థానిక మహిళా ఉత్పత్తులను ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు స్థానిక ఉత్పత్తులను కొనుగోలు చేసి మహిళల జీవనోపాధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మనీషా, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి, మెప్మా పీడీ వెంకటదాసు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# విలేఖరి పై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి,

**- ఎ పి డ బల్యూ జేయఫ్. యూనియన్ ఆధ్వర్యంలో ధర్నాలు,**

ఎమ్మిగనూరు  పల్లె వెలుగు అక్టోబర్ 5 మూడవ తేదీన రాత్రి కోడుమూరు లో ఏపీడబల్యూ






జే ఎఫ్ తాలూకా అధ్యక్షులు ఎన్ టి వి విలేఖరి రఘు పై గుర్తు తెలియని దుండగులు డాడీ చేశారు. దాడిని ఖండిస్తూ యెమ్మిగనూరు ఏపీడబల్యూ జేయఫ్ జర్నలుస్ట్ యూనియన్ విలేఖరులు ధర్నా నిర్వహించి విలేఖరి రఘు పై డాడీ చేసిన వారిని పోలీసులు పట్టుకుని ఖఠినంగా శిక్షించాలని ధర్నా నిర్వహించి  అనంతరం డిప్యూటీ తహసీల్దార్ కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జర్నలిస్ట్ నాయకులు మాట్లాడుతూ ప్రజా స్వామ్యంలో స్వేచ్ఛ విలేఖరులకు ఎక్కడుందని రాష్ట్రాము లో ఎక్కడ చుసిన విలేఖరుల పై దాడులు జరుగుతున్నాయని ప్రజలకు ప్రభుత్వలకు వారధిగా ఉండే జర్నలిస్తులకు భద్రత కరువైందని ప్రభుత్వం పోలీస్ వారికీ ఆదేశించి వెంటనే దుండగుల పై చర్య తీసుకుని శిక్ష పడేలా ఆదేశించాలని ఇటువంటి ఘటనలు పునరావృత్తము కాకుండా విలేఖరులకు భద్రత కలిపించే విధంగా ప్రభుత్వం ఒక జిఓ ను విడుదల చేయాలనీ వారు కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్య వర్గ సభ్యులు రాజేష్ గౌరవ అధ్యక్షులు దేవేంద్ర మూర్తి తాలూకా అధ్యక్షులు షబ్బీర్,ఉపాధ్యాక్షులు ఖలీల్,శంకర్,వెంకటేష్ ట్రెజరర్ ఖాదర్ బేగ్,సహకార కార్య దర్శి పులి సునీల్ కుమార్, రాజు, సభ్యులు పార్థ రాజు విజయ్ ఉస్మాన్ ప్రసాద్,సురేంద్ర ఇలియాస్ మురళి రమేష్,మోష, తదితర విలేఖరులు పాల్గొన్నారు.

# ఉత్తమ శిల్పి అవార్డు గ్రహీత సన్మానం

బనగానపల్లె, అక్టోబర్ 5, పల్లెవెలుగు  మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో ఉత్తమ శిల్పి అవార్డు గ్రహీత ,వడ్డెర సమాజ సంఘం జాతీయ కార్యదర్శి శిల్పి  సుబ్బరాయుడు ను



వడ్డెర సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. సోమవారం రామకృష్ణాపురం గ్రామంలోని మారెమ్మ దేవాలయం ఆవరణంలో శిల్పి సుబ్బరాయుడును సన్మానించారు . శిల్పి సుబ్బరాయుడు మాట్లాడుతూ  వడ్డెర హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తానమని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలలో  ఇంతవరకు ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు చల్లా వెంకటసుబ్బయ్య, మధు శేఖర్ ,కుంచపు నాగేంద్ర, వల్లెపు పరమేష్, దండవుల గోవిందు, జరపట్టి రంగనాయకులు, బేతంచెర్ల మధు, పలుకూరు గోగుల మద్దిలేటి, సంపంగి మధు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# ఉదయానంద హాస్పిటల్ దొంగతనం కేసులో నిందితుడి అరెస్ట్..

పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల ××× టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెంబర్.80/2026 యు/ఎస్ 303(2) బి ఎం ఎస్ కేసులో ఉదయానంద హాస్పిటల్‌లో



నగదు దొంగతనం చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి రూ.1,30,000/- నగదును స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు 04.10.2026 తేదీన సాయంత్రం నంద్యాల పట్టణంలోని నూనెపల్లే ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ క్రింద కోవెలకుంట్ల బస్ స్టాప్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న కంభం వెంకటరెడ్డి, తండ్రి ప్రతాప్ రెడ్డి, వేంపల్లి గ్రామం, కడప జిల్లాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు 19/20.09.2026 రాత్రి నంద్యాల రైల్వే స్టేషన్ సమీపంలోని ఉదయానంద హాస్పిటల్ నందు క్యాష్ కౌంటర్ నుండి రూ.1,40,000/- నగదును దొంగిలించినట్లు వెల్లడించాడు.  నిందితుడి వద్ద ఉన్న రూ.1,30,000/- నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన రూ.10,000/-ను తన వ్యక్తిగత ఖర్చులకు మరియు క్రికెట్ బెట్టింగ్‌కు వినియోగించినట్లు నిందితుడు వెల్లడించాడు.  అదేవిధంగా, గిద్దలూరు పట్టణంలోని డి జి ఆర్ హాస్పిటల్ లో కూడా దొంగతనం చేసినట్లు నిందితుడు వెల్లడించాడు. గతంలో నెల్లూరు జిల్లా బాలాజీనగర్ పోలీస్ స్టేషన్ మరియు పులివెందుల పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా ఇలాంటి దొంగతనం కేసుల్లో నిందితుడిపై పలు కేసులు నమోదైనట్లు విచారణలో వెల్లడైంది. నిందితుడిని 04.10.2026 న సాయంత్రం 5.00 గంటలకు అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి స్వాధీనం చేసుకున్న రూ.1,30,000/- నగదును కేసు తదుపరి దర్యాప్తు నిమిత్తం పోలీసుల స్వాధీనంలోకి తీసుకున్నారు.

ఈ కేసులో నిందితుడిని గుర్తించి పట్టుకోవడంలో గౌరవనీయులైన ఎస్పీ సునీల్ షెరాన్ ఐపీఎస్ ఆదేశాల మేరకు,  ఏ ఎస్ పి ఆర్. సుస్మిత, ఐపీఎస్ పర్యవేక్షణలో, నంద్యాల ××× టౌన్ పోలీస్ సిబ్బంది, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్  సురేష్  మరియు వారి సిబ్బందితో కలిసి సమన్వయంతో కృషి చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మరియు ఏ ఎస్ పి  పోలీస్ సిబ్బంది చేసిన కృషిని అభినందించారు. కేసును ఛేదించడంలో సమర్థవంతంగా పనిచేసిన నంద్యాల ××× టౌన్ పోలీస్, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్  సురేష్ , వారి సిబ్బందిని అభినందించారు.

## పోలీస్ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి 107 ఫిర్యాదులు.




పల్లె వెలుగు నంద్యాల క్రైమ్. నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ ఆదేశాలమేరకు సోమవారం ( 05-10-2026) అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్. ఖాదర్ భాషా "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ గారు ఫిర్యాదిదారుల నుంచి 107 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా అడ్మిన్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులతో ఒక్కొక్కరిగా స్వయంగా మాట్లాడి ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని,నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని,ఫిర్యాదుల పట్ల అలసత్వం వ్యవహరించరాదని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## వైభవంగా ఉమామహేశ్వరుల పల్లకి సేవ మహోత్సవం



బనగానపల్లె , అక్టోబర్ 5, పల్లెవెలుగు మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో పల్లకి సేవ మహోత్సవం వైభవంగా జరిగింది సోమవారం యాగంటి శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో ఉమామహేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ప్రదోషకాల ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను పల్లకి లో ఊరేగింపు నిర్వహించారు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉమామహేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి.పాండురంగా రెడ్డి, ఆలయ చైర్మన్ బండి మౌళీశ్వర రెడ్డి, మాజీ సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి, సభ్యులు తిరుమలయ్య, భరతుడు, జె.సురేష్, మల్లేష్ రెడ్డి, భక్తులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మాలల ఐక్యత వర్ధిల్లాలి

పోరుమామిళ్ల, అక్టోబర్ 5 ( పల్లె వెలుగు):వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల



మండలంలో బుధవారం ఉదయం 10 గంటలకు బద్వేల్, మైదుకూరు నియోజకవర్గాలకు చెందిన మాల మహానాడు నాయకులు, సోదరులతో కలిసి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు కొమ్ముతోటి పౌలు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.మాలలకు జరుగుతున్న అన్యాయాలు, వారికి రావాల్సిన హక్కులు, అందాల్సిన సంక్షేమ పథకాలు, భూ సమస్యలు, ఆర్థిక విధానాలపై సమావేశంలో చర్చించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

బద్వేల్, మైదుకూరు నియోజకవర్గాలకు చెందిన దళిత నాయకులు, అంబేద్కర్ వారసులు, మాల ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర సెక్రటరీ, మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యాల ప్రసాద్ రావు, రాయలసీమ మాల మహానాడు జిల్లా కన్వీనర్ మూరతోటి ఆలివర్, పోరుమామిళ్ల మండల యూత్ అధ్యక్షులు ఉల్లాజీ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

## దొర్నిపాడు మండలం నుండి సీఎం సభకుభారీగా తరలి వెళ్లిన తెలుగు తమ్ముళ్లు




దొర్నిపాడు అక్టోబర్ ఐదు పల్లె వెలుగు న్యూస్ కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలో సోమవారంరాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ గార్ల భారీ బహిరంగ సభకు దొర్నిపాడు మండలం నుండి మండల టిడిపి కన్వీనర్ డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ ఏరువ ప్రసాద్ రెడ్డి సారథ్యంలో 13 బస్సులతోపాటు ఇతరత్రా జీపు వంటి 30 వాహనాల్లో భారీగా తెలుగు తమ్ముళ్లు నాయకులు కార్యకర్తలు వచ్చినట్లుమండల కన్వీనర్ ప్రసాద్ రెడ్డి తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్లగడ్డ నియోజకవర్గంశాసనసభ్యురాలు భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి ఉప ముఖ్యమంత్రి లా భారీ బహిరంగ సభకు తరలి వెళ్లినట్లు ఆయన తెలిపారు రాష్ట్రప్రజలకుసురక్షితమైన నాణ్యమైన తాగునీటిని అందించాలనేలక్ష్యంతో అమలు చేస్తున్న జలజీవన్ అమరజీవి జలధారప్రాజెక్టుకుసంబంధించిన పైలాన్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆవిష్కరించే కార్యక్రమానికి తరలి వెళ్ళినట్లు ఆయన తెలిపారు, కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లోఅభివృద్ధిచెందుతుందని ఆయనఅన్నారుఈకార్యక్రమంలోతెలుగుదేశంపార్టీ నాయకులు గుండు బాబాలు సింగిల్ విండో అధ్యక్షుడు కాశీ విశ్వనాథ రెడ్డి రమణ ,టిడిపి నాయకులు అంకన్నయాదవ్ ,సిద్ధినారాయణ ,శ్రీనుగడ్డం శివయ్య ,మల్లికార్జున కార్యకర్తలుప్రజలు అభిమానులు పాల్గొన్నారు

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి

- అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలి
- క్షేత్రస్థాయి విచారణ తప్పనిసరి.. రీ-ఓపెన్ కేసులను అరికట్టాలి
- కలెక్టరేట్‌లో ఘనంగా 'పీజీఆర్ఎస్', ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహణ

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో ప్రజల నుంచి వచ్చే సమస్యల పరిష్కారంలో అధికారులు ఎలాంటి అలసత్వం ప్రదర్శించినా సహించేది లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి స్పష్టం చేశారు. అర్జీదారులు పూర్తిగా సంతృప్తి చెందేలా నాణ్యమైన, పారదర్శకమైన పరిష్కారాలు అందించాలని ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పీజీఆర్ఎస్)తో పాటు ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రజల నుంచి స్వయంగా వినతులు స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ యంత్రాంగం యొక్క ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి దరఖాస్తును



అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. దరఖాస్తు అందిన వెంటనే అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవాలను పరిశీలించిన తర్వాతే పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్లు స్పష్టంగా, గందరగోళం లేకుండా ఉండాలని, సమస్య పరిష్కారం ఆలస్యమయ్యే పక్షంలో అందుకు గల స్పష్టమైన కారణాలను బాధితులకు వివరించాలని స్పష్టం చేశారు. శాఖల వారీగా "రీ-ఓపెన్", "ఇంప్రాపర్ రెడ్రెసల్" కేసుల శాతాన్ని పూర్తిగా తగ్గించే దిశగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులను హెచ్చరించారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలపై ప్రత్యేక దృష్టి

అనంతరం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రత్యేక గ్రీవెన్స్‌లో భూ సమస్యలు, ఇళ్ల స్థలాలు, పింఛన్లు, ఉపాధి, సంక్షేమ పథకాలకు సంబంధించి పెద్దఎత్తున అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. దరఖాస్తులను శాఖలవారీగా వేగంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు అనురాధ, రామసుబ్బయ్య, శివప్రసాద్ రెడ్డితో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సంతృప్తి స్థాయిపై ప్రత్యేక దృష్టి సారించాలి.

- రీఓపెన్ అర్జీలను మంగళవారం సాయంత్రంలోగా పరిష్కరించాలి.
- బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా అర్జీలను సకాలంలో పరిష్కరించాలి.
- పిజిఆర్ఎస్‌కు 326 దరఖాస్తులు - రెవెన్యూ క్లినిక్స్‌లో 145 అర్జీలు.
- జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.



పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సంతృప్తి స్థాయిని మరింత పెంచేలా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యతతో పాటు అర్జీదారులతో అధికారులు వ్యవహరించే తీరు, స్పందించే విధానం కూడా ప్రజా సంతృప్తిపై ప్రభావం చూపుతుందని, దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీలను స్వీకరించిన అనంతరం జిల్లా కలెక్టర్ వివిధ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ జి. సూరజ్ ధనుంజయ్, సబ్ కలెక్టర్ మనీషా, డీఆర్ఓ రాము నాయక్, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి ఉమామహేశ్వరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సేవలపై ప్రజా సంతృప్తి స్థాయిని తెలుసుకునేందుకు ప్రభుత్వం నేరుగా అర్జీదారులకు ఫోన్ చేసి వారి అభిప్రాయాలను సేకరిస్తోందన్నారు. అధికారులు అందించిన పరిష్కారంపై ప్రశ్నలు అడిగిన అనంతరం మాత్రమే అర్జీదారులు తమ స్పందనను నమోదు చేసేలా వారికి సరైన అవగాహన కల్పించాలని సూచించారు. పీజీఆర్ఎస్‌లో అర్జీదారులతో అధికారులు, సిబ్బంది మాట్లాడే విధానం, వారి ప్రవర్తన, స్పందించే తీరు వంటి అంశాలపై కూడా అభిప్రాయాలను సేకరిస్తున్నందున ప్రతి అధికారి ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సంబంధించి సుమారు 30 అర్జీలు రీఓపెన్ అయ్యాయని వాటన్నింటినీ మంగళవారం సాయంత్రంలోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లడం వల్ల జిల్లా ర్యాంకింగ్‌పై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉన్నందున, ప్రతి అర్జీని నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. భవిష్యత్తులో అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

రెవెన్యూ క్లినిక్స్ ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు

భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్‌ను సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. రెవెన్యూ క్లినిక్స్ ద్వారా మొత్తం 145 దరఖాస్తులు స్వీకరించినట్లు ఆమె వివరించారు. వాటిలో రెవెన్యూ, గ్రామ/వార్డు సచివాలయ సేవలకు సంబంధించి 5, అడంగల్ సవరణలకు 14, చుక్కల భూముల క్రమబద్ధీకరణ, 22-ఏ భూములకు సంబంధించి 7, అసైన్డ్ భూములు, భూ ఆక్రమణలకు సంబంధించి 56, రెవెన్యూ కోర్టు విచారణలు/ఆర్ఓఆర్‌కు సంబంధించి 28, సర్వే, రీ-సర్వేలకు సంబంధించి 32, దేవాదాయ, వక్ఫ్ భూములకు సంబంధించి 3 దరఖాస్తులు ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు.

**పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి స్వీకరించిన కొన్ని అర్జీలు**

1)రుద్రవరం మండలం నర్సాపురం గ్రామానికి చెందిన బద్రి వెంకయ్య సర్వే నంబర్ 787/1ఎలో తనకు 3.95 సెంట్ల భూమి ఉందని, పొలానికి రహదారి సౌకర్యం లేదని, రహదారి ఏర్పాటు చేయడంతో పాటు సర్వే నంబర్‌కు సబ్ డివిజన్ చేయాలని కోరుతూ కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.

2)మిడ్తూరు మండలం వీపనగండ్ల గ్రామానికి చెందిన చౌట్కూరు శేషిరెడ్డి సర్వే నంబర్ 441లో తనకు 7 ఎకరాల 13 సెంట్ల భూమి ఉందని, రీ-సర్వేలో 6 ఎకరాల 9.16 సెంట్లు మాత్రమే నమోదైందని, మిగిలిన భూమిని కూడా సర్వే చేసి హక్కును కల్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు.

3)బేతంచర్ల మండలం కొలుమలపల్లె గ్రామానికి చెందిన జి. నాగభూషణం సర్వే నంబర్లు 122/1, 122/2, 122/3లోని భూములకు కొలతలు నిర్వహించి, క్షేత్రస్థాయిలో హద్దులను నిర్ధారించి చూపించాలని కోరుతూ కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.

## ప్రతి 15 రోజులకు ఇంజనీరింగ్ పనుల పురోగతిపై సమీక్ష.

- భూ కేటాయింపులకు ఈ-ఫైల్ ద్వారా నిర్దేశిత విధానమే పాటించాలి.
- పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ తప్పనిసరిగా పూర్తి చేయాలి: కలెక్టర్ రాజకుమారి గణియా




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. జిల్లాలో కొనసాగుతున్న ఇంజనీరింగ్ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, నిర్మాణాలు పూర్తయిన ప్రాజెక్టులను వినియోగానికి సిద్ధం చేసి సంబంధిత శాఖలకు అప్పగించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. పనుల పురోగతిని ప్రతి 15 రోజులకు ఒకసారి స్వయంగా సమీక్షిస్తానని తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ శాఖల అభివృద్ధి పనులు, భూ కేటాయింపులు, ఇంజనీరింగ్ ప్రాజెక్టులు, ఆధార్ నవీకరణపై పలు కీలక సూచనలు చేశారు. ఏ శాఖకైనా భూమి అవసరమైతే సంబంధిత హెచ్ఓడీ లేదా ప్రిన్సిపల్ సెక్రటరీ ద్వారా ఈ-ఫైల్ రూపంలో కలెక్టర్‌కు రిక్విజిషన్ పంపించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ ఆదేశాల అనంతరం మాత్రమే జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ల ద్వారా భూ కేటాయింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. 5 నుంచి 7 సంవత్సరాలు, 15 నుంచి 17 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ తప్పనిసరిగా చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో సుమారు 52,133 మంది విద్యార్థులు బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉన్నందున, దసరా సెలవులను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలను సమీప ఆధార్ కేంద్రాలు లేదా మొబైల్ కిట్లతో అనుసంధానం చేసి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో అందుబాటులో ఉన్న 169 ఆధార్ కేంద్రాల వివరాలను చిరునామాలతో సహా డి ఈ ఓ, డి.వి.ఈ.ఓ లకు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ ఉచితంగా చేయాలని, ఇతర సేవలకు ప్రభుత్వం నిర్దేశించిన రుసుములనే వసూలు చేయాలని, అదనపు రుసుములు వసూలు చేసే కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

ఆళ్లగడ్డ లోని బాలసదనంలో నివసించే చంటి పిల్లల భద్రతకు ప్రాధాన్యత కల్పిస్తూ ఎలక్ట్రికల్, సివిల్ పనులను పూర్తి భద్రతతో చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బాలసుదన్ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న పాత బావికి రక్షణ చర్యలు చేపట్టడంతో పాటు రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణం వంటి పనులను చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, ఈడబ్ల్యూఐడీసీ, సమగ్ర శిక్ష, మున్సిపాలిటీ తదితర శాఖలు సమన్వయంతో పనులను వేగవంతం చేయాలని సూచించారు. పెచ్చేరువు వద్ద టాయిలెట్, నీటి వసతులు పూర్తయినందున సోలార్ ప్యానెల్స్, విద్యుత్ సదుపాయాల ఏర్పాటుకు నెడ్క్యాప్ ద్వారా అంచనాలు సిద్ధం చేసి తదుపరి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

# పెద్దరాజుపాలెం లోని అంగన్వాడి కేంద్రం లో ఘనంగా అంగన్వాడి ఉత్సవం

బనగానపల్లె, అక్టోబర్ 5, పల్లెవెలుగు అంగన్వాడి కేంద్రం నందు మూడు రోజులు ఈ



మండలంలోని పెద్దరాజుపాలెం గ్రామంలోని అంగన్వాడి కేంద్రం లో అంగన్వాడి ఉత్సవ ప్రోగ్రాం ను ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీ శైలజ ఆధ్వర్యంలో అంగన్వాడి కార్యకర్తలు దోన్నపాటి లక్ష్మీనారాయణమ్మ, బద్రినాయక్ తాండ పద్మావతి బాయి, కలే నాయక్ తాండ లలిత బాయి లు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ అంగన్వాడి ఉత్సవం ప్రోగ్రాం సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 7వ తేదీ వరకు ఒక్కొక్క కార్యక్రమం నిర్వహించబడుతుంది. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీ శైలజ మాట్లాడుతూ పీఎంఎంవివై అనే పథకము గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లుల ఆరోగ్యము పోషక ఆహార అవసరాలను తీర్చడానికి ఉద్దేశించబడిన ఒక ప్రసూతి ప్రయోజన పథకమని తెలిపారు. ముఖ్యంగా గర్భధారణ సమయంలో మరియు ప్రసవం తర్వాత మహిళలందరూ తగినంత విశ్రాంతి తీసుకునేలా చూడడానికి ప్రభుత్వం మొదటిసారి గర్భం దాల్చిన మహిళకు రూ 5000 ఆర్థిక సహాయాన్ని నేరుగా లబ్ధిదారుని బ్యాంకు ఖాతాలోకి జమ చేస్తుందన్నారు. రెండవ కాన్పుకు లింగ నిష్పత్తిని మెరుగుపరచడం కోసం పుట్టబోయే బిడ్డ ఆడపిల్ల అయితే నేరుగా రూ 6000 రూపాయలను ప్రభుత్వం ఒకే విడతలో అందిస్తుందని తెలిపారు. అంతేకాకుండా దేశంలోని ప్రతి బిడ్డకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన, సంతోషకరమైన బాల్యాన్ని అందించాలనే సంకల్పంతో అనాథలు, వీధి బాలలు మరియు విపత్కర పరిస్థితిలో ఉన్న పిల్లలకు కుటుంబాలు సంరక్షణ అందించడమే ఈ మిషన్ వాత్సల్య ముఖ్య ఉద్దేశమన్నారు. అనాథ లేదా నిరుపేద పిల్లలకు చదువుల కోసం సంరక్షణ కోసం కేంద్రం ప్రభుత్వం 60 శాతం వాటా, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం వాటాతో ప్రతినెల రూ 4000 రూపాయలను ఆర్థిక సాయం కింద నేరుగా లబ్ధిదారులకే ప్రభుత్వాలు జమ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధిత అంగన్వాడి కార్యకర్తలు, ఆయాలు, ఆశ వర్కర్లు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

---

# రెండు జేసీబీలను దొంగిలించిన నిందితుడి అరెస్ట్

**● జల్సాలు, మద్యానికి బానిసై చోరీలకు పాల్పడిన యువకుడు ● అడ్డువస్తే కత్తితో దాడి చేసేందుకూ సిద్ధ ● కేసు నమోదు చేసిన 24 గంటల్లోనే ఛేదించిన కర్నూలు త్రీ-టౌన్ పోలీసులు**

పల్లె వెలుగు కర్నూలు బ్యూరో మద్యం, జల్సాలకు బానిసై ఖర్చుల కోసం జేసీబీలను చోరీ చేసిన అంతర్రాష్ట్ర తరహా నిందితుడిని కర్నూలు త్రీ-టౌన్ పోలీసులు వేగంగా స్పందించి అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి చోరీకి గురైన జేసీబీ, నేరానికి ఉపయోగించిన కత్తి, నకిలీ తాళం చెవిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే..

కర్నూలు జిల్లా ఆస్పరి మండలం ములుగుందం గ్రామానికి చెందిన ఆవుల మృత్యుంజయుడు, ఆయన సోదరుడు ఆవుల ప్రభాకర్‌లకు చెందిన రెండు జేసీబీలను కర్నూలు నగరంలోని నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలో నిలిపి ఉంచారు. ఈ క్రమంలో అక్టోబర్ 2, 3 తేదీల్లో ఆ రెండు జేసీబీలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధితులు త్రీ-టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు క్రైమ్ నంబర్లు 274/2026, 276/2026 కింద 307 దీపీూ



సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

దర్యాప్తు ముమ్మరం – 24 గంటల్లోనే పట్టివేత:

కర్నూలు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, కర్నూలు ఎస్డీపీఓ పర్యవేక్షణలో త్రీ-టౌన్ సీఐ పి. శేషయ్య ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో బుధవారపేట హబీబ్ ముబారక్ నగర్‌కు చెందిన చిన్నపోగు పవన్ కుమార్ అలియాస్ పవన్ (27) అనే యువకుడు తాగుడు, జల్సాల కోసం డబ్బుల్లేక ఈ చోరీకి పాల్పడినట్లు గుర్తించారు.

అడ్డువస్తే చంపేందుకూ వెనుకాడకుండా..

నిందితుడు పవన్ కుమార్ చోరీ సమయంలో ఎవరైనా అడ్డువస్తే కత్తితో బెదిరించడం, గాయపరచడం లేదా చంపడానికైనా సిద్ధపడి తన వెంట కత్తిని ఉంచుకున్నాడు. నకిలీ తాళం చెవితో నంద్యాల చెక్‌పోస్ట్ వద్ద ఉన్న రెండు జేసీబీలను దొంగిలించాడు. రెండవ జేసీబీని నడుపుకుంటూ నంద్యాల వైపు వెళ్తున్న క్రమంలో విద్యుత్ స్తంభాలను ఢీకొట్టి వాటిని విరగ్గొట్టినట్లు విచారణలో తేలింది. విశ్వసనీయ సమాచారంతో పోలీసులు నిందితుడిని తన ఇంటి వద్దే అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి జేసీబీ, నేరానికి వాడిన కత్తి, నకిలీ తాళం చెవిని స్వాధీనం చేసుకున్నారు.

పోలీసులకు ఎస్పీ ప్రశంసలు:

కేసు నమోదైన 24 గంటల వ్యవధిలోనే నిందితుడిని పట్టుకుని రికవరీ చేసిన కర్నూలు ఎస్డీపీఓ, త్రీ-టౌన్ సీఐ పి. శేషయ్య మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

---

# పెద్ద కొట్టాల గ్రామాభివృద్ధికి రూ. 67.04 లక్షలు కేటాయింపు: రాష్ట్ర మంత్రి ఎన్ఎండి ఫరూక్.

**☛జల జీవన్ మిషన్ అమరజీవి జలధార పథకం పనులకు ఘనంగా శంకుస్థాపన.**

**☛నంద్యాల నియోజకవర్గంలో రూ. 749.21 లక్షలతో 22 తాగునీటి సరఫరా పనులు చేపడుతున్నట్లు వెల్లడి.**

పల్లె వెలుగు నంద్యాల రూరల్. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు . నంద్యాల మండలం పెద్ద కొట్టాల గ్రామంలో గ్రామీణ నీటి సరఫరా మరియు పారిశుధ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన “జల జీవన్ మిషన్ -- అమరజీవి జలధార” కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ పెద్ద కొట్టాల గ్రామ అభివృద్ధికి ప్రత్యేకంగా రూ. 67.04



లక్షల నిధులు కేటాయించినట్లు తెలిపారు. అలాగే నంద్యాల నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ. 749.21 లక్షల అంచనా వ్యయంతో 22 తాగునీటి సరఫరా పనులను చేపడుతున్నామని వివరించారు. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో పెద్ద కొట్టాల టిడిపి నాయకులు కొప్పుల శివ నాగిరెడ్డి , ఎమ్మార్వో శ్రీవాణి, ఎంపీడీవో సుగుణ శ్రీ , శీలం సుదర్శన్ రెడ్డి, ఎర్రబోతుల వెంకట సుబ్బారెడ్డి, నంద్యాల శివశంకర్ రెడ్డి, కాకనూరు దశరధరామిరెడ్డి, బొండిగ రామారావు, జనసేన పబ్బతి రవి , మధుసూదన్ యాదవ్, నాలి రాజేష్ యాదవ్, మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, అయ్యలూరు త్రిలింగేశ్వర్ రెడ్డి ,స్వామి నాయక్, బుగ్గ రాముడు, గోసుల నాగేశ్వరరావు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రం లో పోషణ మాస వార్షికోత్సవాలు.

పల్లె వెలుగు నెల్లూరు జిల్లా ఎస్ఆర్ పురం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోషణ మాస వార్షికోత్సవాలు రాష్ట్రంలోని గర్భవతులు బాలింతలకు చంటి పిల్లలకు , తల్లులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి శోభారాణి



అన్నారు.పోషణ మాస వార్షికోత్సవాలు లో భాగంగా కార్వేటినగ పశురం ప్రాజెక్ట్ ఐసిడిఎస్ పరిధిలో ఎస్ఆర్ పురం మండలంలోని వివిపురం గ్రామపంచాయతీ ఆరిమాకులపల్లి అంగన్వాడీ కేంద్రం లో సోమవారం అంగన్వాడి కార్యకర్త ఆధ్వర్యంలో పోషణమాసవార్షికోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. అంగన్వాడీ టీచర్లు ను తల్లులుసన్మనించరు. పిల్లలకు అన్నప్రాసన. గర్భిణీకి సీమంతం నిర్వహించారు.మన పిల్లల అభివృద్ధిని కాపాడుకుందాం.. గర్భవతులు, బాలింతలకు ,చంటి పిల్లలకు , తల్లులకు ఆకుకూరలు కూరగాయలు మంచి పౌష్టికారమైన ఆహారాన్ని అందించాలన్నారు . పిల్లలను ఆటలవైపు ఉండేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వి విపురం కార్యకర్త విజయ, , శెట్టి వానతం కార్యకర్త చిన్ని , మంగుంట కార్యకర్త భాగ్యం, చిన్న బాపనపల్లి కార్యకర్త కళావతి , నల్లాపల్లి కార్యకర్త ఝూన్సీ, , పెద్ద కొండపల్లి పావని, ఎస్ ఎస్ ఆర్ పురం కార్యకర్త రత్నమ్మ , వేణుగోపాలపురం కార్యకర్త కళావతి, ఆశ వర్కర్ గీత ఎం ఎల్ హెచ్ వి శోభ ప్రధానోపాధ్యాయురాలు కళావతి ఉపాధ్యాయురాలు జానకి, భాగ్యం, ఏఎన్ ఎం యమునా తదితరులు పాల్గొన్నారు.

# బసవన్నలతో ఇస్కాన్ వారి హిందూ ధర్మ ప్రచారం





దొర్నిపాడు అక్టోబర్ ఐదు పల్లె వెలుగు న్యూస్ మండల కేంద్రమైన దొర్నిపాడు గ్రామంలో సోమవారం ఇస్కాన్ టెంపుల్ వారి ఆధ్వర్యంలో బసవన్నలతో హిందూ ధర్మ ప్రచారాన్ని పాదయాత్రతో గ్రామంలోని పురవీధుల గుండా పాదయాత్రతో రథయాత్ర సాగించారు, ఈ సందర్భంగా ఇస్కాన్ టెంపుల్ సేవకుడు శ్రీధామ్ మాట్లాడుతూ తిరుపతి నుండి శ్రీశైలం వరకు బసవన్నలతో పాదయాత్రను సాగిస్తూ గ్రామ గ్రామాన హిందూ సనాతనధర్మాన్ని,సాంప్రదాయాలనుగ్రామాల్లోనిప్రజలకుతెలియజేస్తూగ్రామ సంకీర్తన ప్రచారాన్ని నిర్వహిస్తున్నామన్నారు, ఈ ప్రచారంలో హరినామ సంకీర్తన భగవద్గీత, గ్రంథ పఠనముశ్రీకృష్ణ బలరాముల జన్మ వృత్తాంతాన్ని ప్రజలకు వివరిస్తూ ప్రచారం సాగిస్తున్నామన్నారు, ప్రచార కార్యక్రమంలో చిన్నారులు కోలాటంతో అలరిస్తూ ప్రచారం సాగించారు

# వన్యప్రాణి వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం

బనగానపల్లె, అక్టోబర్ 5,పల్లెవెలుగు బనగానపల్లె పట్టణము లోని రవ్వలకొండ ఏపీ మోడల్ స్కూల్‌లో వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అటవీ అధికారి, డివిజనల్ అటవీ అధికారి హాజరై విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణ, అడవుల ప్రాముఖ్యత, పర్యావరణ



పరిరక్షణపై అవగాహన కల్పించారు. వన్యప్రాణులు, అటవీ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అధికారులు విద్యార్థులకు వివరించారు. ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో అడవులు, వన్యప్రాణుల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి సి హెచ్ రామలక్ష్మి,ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఈ. శివశంకర్, బీట్ ఆఫీసర్స్ షాహిన్ షా వలి,రఘురాముడు పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు కార్యక్రమాన్ని ఆసక్తిగా విని వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన పొందారు.

# ఆంధ్రప్రదేశ్‌లో వీఆర్‌ల నిరసన: ఇతర రాష్ట్రాలతో పోలిస్తే అరకొర వేతనాలు -- సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్

పోరుమామిళ్ల, అక్టోబర్ 5 ( పల్లె వెలుగు ):రాష్ట్రవ్యాప్తంగా గ్రామ రెవెన్యూ సహాయకుల (వి ఆర్ ఏ ) సమస్యలను తక్షణమే పరిష్కరించి, తమ న్యాయమైన డిమాండ్లకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ వీఆర్ఏలు చేపట్టిన శాంతియుత సమ్మె కొనసాగుతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ సంఘ నాయకులతో చర్చలు జరిపి న్యాయం చేయాలని పోరుమామిళ్ల మండల వీఆర్ఏల సమితి కోరింది.

ఎన్నికల హామీలను గుర్తుచేసిన వీఆర్ఏ నాయకులు 2024 ఎన్నికల ముందు పాదయాత్రలు, బహిరంగ సభల సందర్భంగా ఇచ్చిన హామీలను ఈ సందర్భంగా వీఆర్ఏ నాయకులు గుర్తుచేశారు. నారా లోకేష్ పాదయాత్ర: 2024లో కర్నూలులో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో తమ కష్టాలను వివరించగా, ప్రభుత్వం రాగానే వీఆర్ఏలకు అండగా ఉంటామని నారా లోకేష్ హామీ ఇచ్చారని తెలిపారు. చంద్రబాబు నాయుడు ప్రకటన: బహిరంగ సభల్లో వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ భేటీ ఒ మేనిఫెస్టో:

మంగళగిరిలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను కలిసి సమస్యలు వివరించినప్పుడు, తమ అంశాలను కూటమి మేనిఫెస్టోలో కూడా చేర్చారని విన్నవించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినందున, ఇచ్చిన హామీల ప్రకారం తక్షణమే చర్చలు జరిపి తమకు న్యాయం చేయాలని వీఆర్ఏలు విజ్ఞప్తి చేశారు.

ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో తీవ్ర వేతన వ్యత్యాసం (60% – 75% తక్కువ)

పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోని వీఆర్ఏల వేతనాలు అత్యంత దయనీయంగా ఉన్నాయని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు.

వివిధ రాష్ట్రాల్లో గ్రామ స్థాయి రెవెన్యూ సిబ్బంది పొందుతున్న వేతనాల వివరాలు:

ఆంధ్రప్రదేశ్ లో వీ ఆర్ ఏ లకు రూ. 10,500 మాత్రమే (అత్య ల్పం)

తెలంగాణ లో రూ. 29,000 -- రూ.38,000 (అత్యధికం ) కర్ణాటక లో రూ.28,000 -- రూ.35,000 (అత్యధికం)

మహారాష్ట్ర లో రూ.30,000 -- రూ.40,000 (అత్యధికం) పంజాబ్, పట్వారీ లో రూ.32,564 (అత్యధికం ) రాజస్థాన్ । పట్వారీ లో రూ.24,000 । (అత్యధికం) ఇలా ఇతర



రాష్ట్రాల్లో రూ. 24,000 నుండి రూ. 40,000 వరకు జీతాలు చెల్లిస్తుండగా, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం కేవలం రూ. 10,500 మాత్రమే ఇస్తున్నారని, ఇది ఇతర రాష్ట్రాల కంటే 60% నుండి 75% తక్కువ అని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వానికి పోరుమామిళ్ల మండల సమితి విజ్ఞప్తి రాష్ట్రంలోని వీఆర్ఏలందరి తరఫున ప్రభుత్వం తక్షణమే స్పందించి, వేతనాల పెంపుతో పాటు అన్ని రకాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని పోరుమామిళ్ల మండల వీఆర్ఏ సంఘం డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో పవైఎస్సార్ కడప జిల్లా, పోరుమామిళ్ల మండల అధ్యక్షురాలు సుజాత, ఉపాధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, వరాలు మరియు ఇతర వీఆర్ఏలు పాల్గొన్నారు.

Printed and published by M.Mahesh babu on behaly of m/s mahesh publications # 13-36A, Nelliveedhi, Nandyal District, Nadyal printed at sai Aishwayam Apartment, Near Bharatha Matha Temple B-Block, Flat no 105, Tekke, Nandyal (Dist) AP pin-code 518501 EDITOR; M Mahesh Babu RNI No: APTEL/2012/46499Phone No :-9849499960,9059696959 Email id: Pallevelugunews9@gmail.com

## అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతాం

ఆళ్లగడ్డ ప్రతినిధి అక్టోబర్ 5 పల్లె వెలుగు ఆళ్లగడ్డ పట్టణంలో శాంతి భద్రతల సంరక్షణ,



అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కు పాదం మోపుతామని ఆళ్లగడ్డ టౌన్ సీఐ రాము హెచ్చరించారు. సోమవారం ఆయన నూతన టౌన్ సీఐ గా పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ రోజు ఆళ్లగడ్డ సీఐగా భాధ్యతలు స్వీకరించడం జరిగిందన్నారు. గతంలో ఆత్మకూరు సీఐ గా పని చేసినప్పుడు పోలీసు ఉద్యోగాల కోసం శిక్షణ ఇవ్వగా ఐదు మంది అభ్యర్థులకు పోస్టింగ్ రావడం జరిగిందన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో కూడా మంచి క్రీడా మైదానం ఉండడంతో తాము భవిష్యత్తులో ఇక్కడ కూడా పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దుతామని సిఐ రాము తెలిపారు. ప్రజలు కేసుల విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా తమను సంప్రదిస్తే న్యాయం జరుగుతుందని సిఐ రాము వివరించారు.

## తక్కువ ధరలకే మందులు అందుబాటులోకి రానున్నాయి.

రుద్రవరం. పల్లె వెలుగు : గొర్రెల పెంపకం దారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మార్కెట్లో కంటే 50% ధరలకే మందులు సరఫరా చేసేందుకు చర్యలు



తీసుకుంటుందని తొందర్లోనే తక్కువ ధరలకే మందులు అందుబాటులోకి రానున్నాయని రుద్రవరంలోని ప్రాంతీయ పశు వైద్యశాల దగ్గర పశు ఔషధ విక్రయిశాలను నిర్మిస్తున్నట్లు ఏడిఏ మనోరంజన్ ప్రతాప్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పశువులు మూగజీవాల రైతులకు ప్రభుత్వం సబ్సిడీ కింద మందులు సరఫరా చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ సరఫరా చేసే మందులలో పశు ఔషధ విక్రయశాల ద్వారా పశువులు మూగజీవాల రైతులకు మార్కెట్ ధరలకంటే 50% తక్కువ దరకే విక్రయించడం జరుగుతుందన్నారు. అతి త్వరలోనే ఈ పశువు ఔషధ విక్రయశాలలో నిర్మించడం కొరకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని వారం 10 రోజుల్లో విక్రయిశాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. పశు ఔషధ విక్రయశాలను ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం అధ్యక్షులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రుద్రవరం మండలంలో 8 ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాలు ఉన్నాయని, బీరవోలు, యల్లావత్తుల, శ్రీరంగాపురం, భూమా నాగిరెడ్డిపల్లె, టీ లింగందిన్నె, రుద్రవరం గ్రామాలలో ఈ సంఘాలు ఉన్నాయని తెలిపారు. ఈ సంఘాల అధ్యక్షులు సభ్యులు పశు ఔషధ విక్రయశాలలో మందులు కొనుగోలు చేసేందుకు మూగజీవాల రైతులకు వివరించడం జరుగుతుందని ఏడిఏ తెలిపారు.

## దసరా నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ.

రుద్రవరం. పల్లె వెలుగు : రుద్రవరం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో సోమవారం



దసరా నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆర్యవైశ్యులు ఆవిష్కరించారు. అంతకుముందు పూజారి విశ్వనాథ శర్మ పత్రికను అమ్మవారి వద్ద ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 11 నుంచి 21 వరకు శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ప్రత్యేకంగా బిందె సేవ, పండుగ రోజే అమ్మవారి మెరువని ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు వంకదార శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు నల్లగట్ల వెంకటేశ్వర్లు, కార్యదర్శి పాలూరి వెంకట సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు వెంకట సుబ్బ నరసయ్య, రమణ, సురేష్, కృష్ణమూర్తి, మోహన్ కృష్ణ, గిరి ప్రసాద్, సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ ఎమ్మార్పీఎస్ 13వ వార్షికోత్సవ సభ కరపత్రాలు విడుదల

పల్లె వెలుగు కర్నూలు రిపోర్టర్ : ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 13వ



వార్షికోత్సవ మహాసభకు సంబంధించిన కరపత్రాలను సోమవారం విడుదల చేశారు. కలెక్టరేట్ లో ఏపీ ఎంఆర్పిఎస్ నాయకులు బైరాపురం రాజు మాదిగ మాట్లాడుతూ 2026 అక్టోబర్ 12వ తేదీన బనగానపల్లెలో జరగబోయే ఏపీ ఎంఆర్పిఎస్ 13వ వార్షికోత్సవ మహాసభను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాదిగల హక్కుల సాధన సామాజిక న్యాయం, చర్మ కళాకారులు, డప్పు కళాకారుల సంక్షేమం కోసం ఏపీ ఎంఆర్పిఎస్ నిరంతర పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. ఈ వార్షికోత్సవ మహాసభను విజయవంతం చేసేందుకు మాదిగ ప్రజానీకం, మాదిగ విద్యార్థులు, విద్యార్థినిలు, చర్మ డప్పు కళాకారులు, ఏపీ ఎంఆర్పిఎస్ మహిళ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున రావాలని పిలుపునిచ్చారు. ఈ సభకు ప్రతి గ్రామం నుంచి మాదిగ సోదరులు సోదరీమణులు యువత విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరై ఐక్యతను చాటాలని హక్కుల సాధన కోసం సమిష్టిగా ముందుకు సాగాలని కోరారు. అక్టోబర్ 12 నిర్వహించనున్న మహా బహిరంగ సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బైరాపురం రాజు, ఆంజనేయ మాదిగ, రెడ్డి పోగు రాజశేఖర్ మీసాల బాబు, మీసాల దాసు, నాగరాజు వెంకటాద్రి తదితర ఏపీ ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా నాయకులు పాల్గొన్నారు

# విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాల పెంపు,

## బడి బయట పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలి.

**నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి.**

**విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్షించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**




పల్లె వెలుగు నంద్యాల జిల్లా బ్యూరో. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యా ప్రమాణాల మెరుగుదలకు చర్యలు చేపట్టాలని, బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేలా ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్లో పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి మరియు శిక్షణ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి వివిధ కార్యక్రమాల అమలు తీరు, పురోగతిని పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల రోజువారీ హాజరును పకడ్బందీగా పర్యవేక్షించాలని, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిర్దేశించిన మిషన్ మార్చి-2027 లక్ష్యాల సాధనకు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు లీప్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పించాలని, ఐవీఆర్ఎస్ విధానం ద్వారా పాఠశాలల పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు అవసరమైన స్థల కేటాయింపు సమస్యలను పరిష్కరించడంతో పాటు, జవహర్ నవోదయ విద్యాలయ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలపై తదుపరి చర్యలు వేగవంతం చేయాలని తెలిపారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి వారి వయస్సుకు తగిన తరగతుల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని, సమగ్ర శిక్ష కార్యక్రమాల అమలులో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

అనంతరం నైపుణ్యాభివృద్ధి, ఉపాధి మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ పథకాల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన , దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన , పీఎం సేతు , నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్ , ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ స్కీమ్ , స్కిల్ పోర్టల్ రిజిస్ట్రేషన్లు, భవన నిర్మాణ మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమానికి సంబంధించిన బి ఓ సి డబ్ల్యు, ఓఎంసీఏ పి తదితర కార్యక్రమాల అమలు, పురోగతిపై సమీక్షించారు. ప్రభుత్వ పథకాల ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందించడంతో పాటు, శిక్షణ పొందిన అభ్యర్థులకు పరిశ్రమలు, వివిధ సంస్థల్లో అప్రెంటిస్‌షిప్, ఇంటర్న్‌షిప్, ఉపాధి అవకాశాలు కల్పించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన యువతకు పథకాల ప్రయోజనాలు చేరేలా విస్తృత అవగాహన కల్పించాలని, పోర్టల్ రిజిస్ట్రేషన్లలో పురోగతి సాధించాలని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి, సమగ్ర శిక్ష పీఓ సుధాకర్ రెడ్డి, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అండ్ స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సోమశివారెడ్డి, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఎన్ఏసీ ఏ.డీ. సంతోష్, సీడాప్ జేడీఎం షాజహా తదితరులు పాల్గొన్నారు.

## బనగానపల్లెలో ఘనంగా ముగిసిన రాష్ట్ర స్థాయి ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్

బనగానపల్లె, అక్టోబర్ 5,పల్లెవెలుగు బనగానపల్లె



పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో రాష్ట్ర మంత్రి శ్రీ బీసీ జనార్దన్ రెడ్డి గారి సహకారంతో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ పోటీల్లో మొత్తం 25 జట్లు పాల్గొని హోరాహోరీగా తలపడ్డాయి.

టోర్నమెంట్‌లో భాగంగా జరిగిన ఫైనల్ పోటీలో బనగానపల్లె జట్టు, సుంకులమ్మ యూత్ టీం తలపడగా, ఉత్కంఠభరితంగా సాగిన పోరులో బనగానపల్లె జట్టు విజయం సాధించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. సుంకులమ్మ యూత్ టీం ద్వితీయ స్థానంలో, చాగలమర్రి టీం తృతీయ స్థానంలో నిలవగా, బనగానపల్లె లోకల్ టీం నాలుగో స్థానాన్ని దక్కించుకుంది.

విజేత బనగానపల్లె జట్టుకు రూ.50 వేల ప్రథమ బహుమతి, ద్వితీయ స్థానంలో నిలిచిన సుంకులమ్మ యూత్ టీంకు రూ.30 వేల బహుమతి, తృతీయ స్థానంలో నిలిచిన చాగలమర్రి టీంకు రూ.20 వేల బహుమతి, నాలుగో స్థానంలో నిలిచిన బనగానపల్లె లోకల్ టీంకు రూ.10 వేల నగదు బహుమతులను దాత శ్రీమతి బీసీ ఇందిరా రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా విజేతలను అభినందించి, క్రీడాకారులు భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా బీసీ ఇందిరా రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలకు తమవంతు ప్రోత్సాహం ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని, యువత క్రీడల్లో రాణించి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, ఐక్యతా భావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. టోర్నమెంట్ విజయవంతంగా ముగియడంతో నిర్వాహకులు, క్రీడాకారులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వహణకు సహకరించిన రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, దాత బీసీ ఇందిరా రెడ్డికి నిర్వాహకులు, క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో బనగానపల్లె మార్కెట్ యార్డ్ చైర్మన్ కాత్రేడ్డి మల్లికార్జున రెడ్డి, యాగంటి దేవస్థానం పాలక మండలి చైర్మన్ బండి మౌల్లేశ్వర రెడ్డి,యాగంటి దేవస్థానం పాలకమండలి సభ్యుడు పి. శ్రీరాములు, రాయలసీమ కలామ్, మరియు క్రీడకారులు తదితరులు పాల్గొన్నారు

# వార్డులో ప్రజల సమస్యలపై ,

ఎమ్మిగనూరు పల్లె వెలుగు అక్టోబర్ 5 ఎమ్మిగనూరు



పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న “నమస్తే ఎమ్మిగనూరు ప్రజా సమస్యలపై పోరుబాట” కార్యక్రమం 16వ రోజు కొత్త 4వ వార్డు (పాత 9వ వార్డు)లో ఉత్సాహంగా కొనసాగింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీ ఎర్రకోట రాజీవ్ రెడ్డి వార్డులో పర్యటించేందుకు చేరుకున్న సందర్భంగా వార్డు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు. మాజీ కౌన్సిలర్ రాజరత్నం , వార్డు అధ్యక్షులు పీకే గౌస్ గుమ్మల చిన్న , ముల్ల సాబీర్ తదితరుల ఆధ్వర్యంలో రాజీవ్ రెడ్డి గారికి శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. రాజీవ్ రెడ్డి వార్డు నాయకులు, కార్యకర్తలతో కలిసి వార్డులో విస్తృతంగా పర్యటించారు. ప్రతి ప్రాంతంలో ప్రజలను నేరుగా కలుసుకుని “మీ సమస్య ఏమిటి? మీకు ఏ ఇబ్బంది ఉంది?” అంటూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై ప్రజల ఆవేదన

ఈ సందర్భంగా వార్డు ప్రజలు తమ ప్రధాన సమస్యలను రాజీవ్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రోడ్ల దుస్థితి, డ్రైనేజీ సమస్యలు, మౌలిక వసతుల కొరత కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వార్డులో పర్యటించిన సమయంలో పలువురు ప్రజలు తమ సమస్యలను



నేరుగా రాజీవ్ రెడ్డి కి వివరించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. రెండు నెలల క్రితం ఎమ్మెల్యే వచ్చారు.. హామీ ఇచ్చారు.. ఇప్పటికీ పనులు లేవు” ఈ సందర్భంగా వార్డు ప్రజలు మాట్లాడుతూ.. ప్రస్తుత ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి సుమారు రెండు నెలల క్రితం వార్డులో పర్యటించి రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, అయితే ఇప్పటివరకు ఆ హామీ అమలుకు నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. హామీలు ఇచ్చి వెళ్లిన తర్వాత ఇప్పటివరకు ఎమ్మెల్యే తమ వార్డు వైపు తిరిగి చూడలేదని, రోడ్లు--డ్రైనేజీ సమస్యలు అలాగే ఉన్నాయని ప్రజలు వాపోయారు. అలాగే కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని ప్రజలు తమ అసంతృప్తిని రాజీవ్ రెడ్డి వద్ద వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వంలో వాలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమం ఇంటి వద్దకే” ఈ సందర్భంగా పలువురు వార్డు ప్రజలు గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని గుర్తు చేసుకున్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి ప్రభుత్వంలో వాలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు ప్రజల ఇంటి వద్దకే చేరేవని వారు గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, తమ సమస్యలను పట్టించుకునే నాయకత్వం అవసరమని వారు రాజీవ్ రెడ్డి గారితో పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎర్రకోట రాజీవ్ రెడ్డి వార్డు ప్రజలు వెల్లడించిన సమస్యలను రాజీవ్ రెడ్డి శ్రద్ధగా విని, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతామని భరోసా ఇచ్చారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే వార్డును అభివృద్ధి చేసుకునేందుకు ప్రజలతో కలిసి కృషి చేస్తామని తెలిపారు. వార్డులో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా 2029లో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అవుతారని, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను మరింత సమర్థవంతంగా కొనసాగిస్తామని రాజీవ్ రెడ్డి ప్రజలకు భరోసా కల్పించారు. ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను స్వయంగా తెలుసుకుంటూ, వాటి పరిష్కారం కోసం ప్రజల గొంతుకగా నిలుస్తున్న “నమస్తే ఎమ్మిగనూరు ప్రజా సమస్యలపై పోరుబాట” కార్యక్రమానికి వార్డు ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ విభాగాల నాయకులు, అభిమానులు, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.